మేధస్సుకు పరీక్ష 6
- విద్యార్థులకు జాతీయస్థాయిలో ప్రతిభాన్వేషణ పరీక్ష
- శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించేలా ప్రోత్సాహం
- 'విద్యార్థి విజ్ఞాన్ మంథన్' దరఖాస్తుకు 6వతరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు అవకాశం
- ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు సెప్టెంబరు 30 వరకు గడువు



నౌకాశ్రయం!

కాకినాడలో హిందుస్థాన్ షిప్‌యార్డ్ నిర్మాణ యోచన

- అనువైన ప్రాంతానికి అన్వేషణ
- 110 ఎకరాలకు ప్రతిపాదన
- బుధవారం పర్యటించిన ప్రతినిధులు
- డీప్‌వాటర్‌పోర్టులో పరిశీలన
- రూ.900 కోట్లతో కేంద్రం
- అన్నీ కుదిరితే పెద్ద ప్రాజెక్టు
- మారీటైంబోర్డు సానుకూలత
- మూలపేటపైనా కసరత్తు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

కాకినాడలో నౌకా నిర్మాణ కేంద్రం ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వానికి చెందిన హిందుస్థాన్ షిప్ యార్డు లిమిటెడ్ (హెచ్‌ఎస్‌ఎల్) ఇక్కడ శాటిలైట్ షిప్ యార్డు నిర్మాణానికి మొగ్గు చూపుతోంది. ఈ మేరకు హెచ్‌ఎస్‌ఎల్ అధికారికంగా ధ్రువీకరించింది.ఈ నేపథ్యంలో కాకినాడలో అనువైన భూముల లభ్యత ఎక్కడ ఉందనేది పరిశీలిస్తోంది. ఇప్పటికే ఇక్కడ ఓ సంస్థ ఎప్పటి నుంచో నౌకలు తయారు చేస్తుండడం,ఇక్కడున్న సానుకూల వాతావరణంతో కాకినాడే ఖాయమయ్యే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

కాకినాడ అనువైన ప్రాంతం

నౌకల నిర్మాణం చేపట్టడానికి సముద్రపు అలల తాకిడి తక్కువగా ఉన్న ప్రాంతం చాలా కీలకం.ఇది కాకినాడలో ఉంది. పైగా ఒకప్పుడు బ్రిటిష్ యుగంలో కోరంగి వద్ద నౌకల తయారీ, మరమ్మతులు జరిగేవి. అప్పుడే ఈ రంగంలో కాకినాడ పేరొందింది. కానీ ఆ తర్వాత పెద్దగా ఈ రంగం కాకినాడలో విస్తరించలేదు. నౌకల తయారీకి సముద్రానికి ఆనుకుని విశాలమైన భూములు అవసరం. వీటిలో నౌకలు, బార్జీలు, టగ్‌లు తయారు చేసి ఆ పక్కనే ఉన్న సముద్ర జలాల్లోకి వీటిని దించి పరీక్షలు చేసి సరుకు రవాణాకు వినియోగిస్తారు.ఈ అనుకూల వాతావరణం కాకినాడలోనే ఉంది. సీఫ్రంట్‌గా పిలిచే ఈ సౌకర్యం కాకినాడ జగన్నాథపురం బ్రిడ్జి నుంచి యాంకరేజ్ పోర్టు వరకు రెండు కిలోమీటర్ల వరకు విస్తరించి ఉంది. ఇన్ని సానుకూలతలు కాకినాడకు ఉన్నాయి.

సీఎంను కలిశారు..

రాష్ట్రంలో భారీ నౌకల నిర్మాణం విశాఖలో కేంద్ర ప్రభుత్వానికి చెందిన హిందుస్థాన్ షిప్ యార్డు చేపడుతోంది.ఇది మినహా షిప్‌యార్డు మరెక్కడా భారీగా లేదు. త్వరలో మరో షిప్ యార్డు నిర్మించడానికి కాకినాడ అనువైనదిగా భావిస్తోంది. 110 నుంచి 150 ఎకరాల భూములు ఉన్న చోట షిప్‌యార్డు నిర్మాణం చేపడతామని హెచ్‌ఎస్‌ఎల్ సీఎండీ ఖత్రీ ప్రకటించారు.ఇప్పటికే సీఎం చంద్రబాబును కలిసి తమ ప్రతిపాదన వివరించారు.షిప్‌యార్డుకు కాకినాడే అనువైనదిగా ఆ సంస్థ భావిస్తోంది.

గతంలో చాలా కంపెనీలు..

గతంలో కాకినాడలో షిప్‌యార్డు నిర్మించడానికి సింగపూర్ కంపెనీ ముందుకు వచ్చింది. కాకినాడ సీపోర్టులో కొంతకాలం కార్యకలాపాలు నిర్వ హించింది. వివిధ దశల్లో రూ.1,725 కోట్ల పెట్టుబడులకు సిద్ధమైంది. ప్రోత్సాహం కరువై ఇక్కడ యార్డును మూసేసింది. ఎల్‌అండ్‌టీ కంపెనీ 2006లో కాకినాడలో షిప్‌యార్డు నిర్మాణానికి ముందుకొచ్చింది. రూ.2 వేల కోట్ల పెట్టుబడితో నౌకా నిర్మాణ కేంద్రం ఏర్పాటుకు రంగం సిద్ధం చేసుకుంది. కానీ అప్పటి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేక చెన్నైకు వెళ్లిపోయింది. 2020లో రూ.7 కోట్ల కాకినాడ స్మార్ట్‌సిటీ నిధులతో జగన్నాథపురం సమీపంలో అధికారులు బోట్ బిల్డింగ్ యార్డు నిర్మించారు.ఇందులో ఒకేసారి 18 వరకు భారీ బోట్లు తయారుచేసే వసతులు సిద్ధం చేశారు. కానీ తగిన ప్రోత్సాహం లేక అదీ ఈసురోమంటోంది. కొచ్చిన్, గోవా, మజ్‌గావ్‌లో హిందుస్థాన్ షిప్‌యార్డులు 100 నుంచి 150 ఎకరాల విస్తీర్ణంలో నౌకలను నిర్మిస్తున్నాయి.ప్రస్తుతం కాకినాడలో శాన్‌మెరైన్ అనే సంస్థ ఎన్నో ఏళ్లుగా చిన్న, మధ్య తరహా నౌకలు, బార్జీలు, టగ్‌లు నిర్మిస్తోంది. గతేడాది 8వేల టన్నుల భారీ నౌకను నిర్మించింది. వచ్చే ఐ దేళ్లలో మరో 25 వరకు నిర్మించి దేశ వ్యాప్తంగా పలు కంపెనీలకు అందివ్వడానికి సిద్ధమవుతోంది. ఈ సంస్థ హిందుస్థాన్ షిప్ యార్డుతోను పలు ఒప్పందాలు చేసుకుంది.

ఓకే అంటే రూ.900 కోట్లు

బుధవారం డీప్‌వాటర్‌పోర్టు ఏరియాలోని రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన భూములను హిందుస్థాన్ షిప్‌యార్డు ప్రతినిధులు పరిశీలించారు.భూముల లభ్యత.. సముద్రానికి ఎంత దూరం వంటివన్నీ పరిశీలించారు. ఇక్కడే ఉన్న మారీటైం బోర్డు అధికారులతోను సమావేశమయ్యారు.ఈ నేపథ్యంలో త్వరలో నిర్ణయం తీసుకోనున్నారు. ఒకవేళ కాకినాడలో భూములు ఓకే అయితే రూ.900 కోట్ల వరకు హిందుస్థాన్ షిప్‌యార్డు ఇక్కడ పెట్టుబడులు పెట్టనుంది. ప్రస్తుతం రక్షణశాఖకు అవసరమైన అన్నిరకాల యుద్ధ,ఇతర నౌకలను హెచ్‌ఎస్‌ఎల్ నిర్మిస్తోంది. భారత నావికాదళంతో రూ.19 వేల కోట్ల విలువైన భవిష్యత్తు ఆర్డర్లు ఈ సంస్థకు ఉన్నాయి.ప్రస్తుతం విశాఖలో ఉన్న షిప్‌యార్డుకు బ్రాంచ్ యార్డుగా కొత్తది నిర్మించనున్నారు. తద్వారా నౌకల నిర్మాణం మరింత వేగవంతం చేయాలని ఈ సంస్థ ఆలోచన. కాకినాడతో పాటు శ్రీకాకుళం జిల్లా మూలపేట తీరప్రాంతాన్ని హెచ్‌ఎస్‌ఎల్ పరిశీలించి తుది నిర్ణయం తీసుకోనుంది.దాదాపుగా కాకినాడవైపే హెచ్ ఎస్‌ఎల్ ఎక్కువ ఆసక్తి చూపుతోందని అధికారులు చెబుతున్నారు. ఇక్కడ సానుకూలతతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన ఏపీ మారిటైం పాలసీకి కాకినాడ కేంద్రంగా ఉన్న రాష్ట్ర మారిటైం బోర్డు కార్యాలయం నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుండడంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ఇక్కడే భూముల కేటాయింపు జరిగేలా పర్యవేక్షిస్తోంది.



సేవలందే.. దారేది?



కాకినాడ జీపీటీ ఆవరణలో రూ.15 కోట్లతో నిర్మించిన ఆయుష్ సమీకృత ఆసుపత్రి భవనం

- కాకినాడలో రూ.15కోట్లతో ఆయుష్ ఆస్పత్రి భవనం నిర్మాణం
- రాష్ట్రంలో ఇదే మొట్టమొదటి ఇంటిగ్రేటెడ్ హాస్పిటల్
- నిర్మించి ఏడాది పూర్తయినా ప్రారంభానికి నోచుకోని వైనం
- ఆస్పత్రికి వెళ్లేందుకు దారి లేదు
- జీపీటీ కళాశాల అధికారుల అభ్యంతరంతో చిక్కులు

ఆయుష్ ఇంటిగ్రేటెడ్ హాస్పిటల్ భవనం.. దాదాపు అన్ని పనులు పూర్తి చేసుకుని సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నా.. దాన్ని అందుబాటులోకి తెచ్చే 'దారి' మాత్రం కానరావడం లేదు. రూ.15కోట్ల నిధులతో అధునాతన భవన నిర్మాణం చేపట్టి రెండేళ్లు కావొస్తున్నా.. ప్రారంభానికి నోచుకునే 'మార్గం' కనిపించడం లేదు. జిల్లా ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఈ విషయంలో చొరవ చూపి పరిష్కార చూపేలా 'రూట్' క్లియర్ చేయాల్సిన అవసరం ఉంది.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కాకినాడ జిల్లావాసులకు ఆయుర్వేదం(ఏ), యోగా(వై), యునానీ(యూ), సిద్ధా(ఎస్), హోమియోపతి(హెచ్) ఇలా ఐదురకాల వైద్య సేవలు ఒకేచోట అందించే ఉద్దేశంతో పదేళ్ల క్రితం కాకినాడ వాసి, అప్పటి ఆయుష్ కమిషనర్ నళినీమోహన్ ఆయుష్ సమీకృత ఆస్పత్రి నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని స్థానిక వైద్యులకు మాటిచ్చారు. దీంతో అప్పటి ఆయుష్ విభాగ సీనియర్ వైద్యులు కొందరు స్థలసేకరణకు సిద్ధమయ్యారు. 2015లో అప్పటి జిల్లా ఉన్నతాధికారుల ద్వారా కొండయ్యపాలెం శారదమ్మగుడినుంచి నాగమల్లితోట జంక్షన్‌కు వెళ్లే దారిలో చీడిలపొర డ్రెయిన్‌ను ఆనుకుని 2.54ఎకరాల భూమిసేకరణకు సిద్ధమయ్యారు. దీనికి మ్యాచింగ్ గ్రాంట్ నిధులు రూ.7.5కోట్లు కూడా విడుదలయ్యాయి. కానీ, ఈ స్థలం నుంచి హైవే రోడ్డు వెళ్లడంతో 70సెంట్లు మాత్రమే మిగిలింది. దీంతో ఆయుష్ ఆసుపత్రి నిర్మాణానికి స్థలం సరిపోక పనులు ప్రారంభంకాలేదు. విడుదలైన నిధులు ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీఎంఎస్ఐడీసీ) వద్ద ఉండిపోయాయి.

తిరిగి ఏడేళ్ల తర్వాత..

2022, ఫిబ్రవరిలో అప్పటి ఆయుష్ జిల్లా అధికారి బి.జగదీశ్వరరావు, ఇతరులు చొరవ తీసుకుని అప్పటి కాకినాడ ఎంపీ వంగాగీత వద్దకు విషయాన్ని తీసుకువెళ్లారు. నిధులు సిద్ధంగా ఉన్నాయని, స్థలం చూపిస్తే ఆయుష్ ఆస్పత్రి నిర్మించవచ్చని ఆమెకు వివరించారు. మహిళా పాలిటెక్నిక్ కళాశాల(జీపీటీ) ఆవరణలో మెడికల్ హబ్ ఏర్పాటు కోసం కేటాయించిన 7.5ఎకరాల స్థలం ఉండడంతో దానిలో రెండెకరాల స్థలం ఆయుష్ఆస్పత్రి నిర్మాణానికి ఇవ్వాలని ఎంపీ ప్రతిపాదనలు పంపారు. దీంతో 2022, నవంబరు 14న ఆయుష్ ఆస్పత్రి నిర్మాణానికి జీపీటీ ఆవరణలోని రెండెకరాలను కేటాయిస్తూ అప్పటి కలెక్టర్ నిర్ణయం తీసుకున్నారు. 2023, ఏప్రిల్, మే నెల మధ్య కాలంలో ఏపీఎంఎస్ఐడీసీ వారి ఆధ్వర్యంలో పనులు ప్రారంభమయ్యాయి. మరో రూ.7.5కోట్లు కూడా కేటాయించారు. ఇలా రూ.12కోట్లతో భవన నిర్మాణం, రూ.3కోట్లతో పరికరాల కొనుగోలు, ఇతర సౌకర్యాలు, వసతుల కల్పనకు కేటాయించారు. దీంతో 2024,డిసెంబర్‌నాటికి 50పడకల ఆయుష్ ఆస్పత్రి భవనం పూర్తయ్యింది.

ఇలా చేస్తే 'దారి' లభించేనా?

జీపీటీ కళాశాల ప్రధాన గేటు నుంచి కుడివైపు(వేంకటేశ్వరస్వామి గుడివైపు)గా ఆయుష్ ఆస్పత్రి భవన నిర్మాణం వరకు అర కిలోమీటరు మేర రహదారి ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అది రోగులు వచ్చేందుకు దురాభారంకానుంది. జీపీటీ ప్రహరీని చేర్చి.. చీడిలపొర డ్రెయిన్‌ను ఆనుకుని ఉన్న ప్రైవేటు స్థలంనుంచి హైవే వైపునకు వెళ్లేలా రహదారి నిర్మిస్తే సులువుగా ఆస్పత్రికి చేరుకునే అవకాశం ఉంది. అక్కడ ప్రైవేటు వ్యక్తులనుంచి స్థల సేకరణ చేయాల్సి ఉంది. ఆయుష్ అధికారులు ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈవిషయంలో ఉన్నతాధికారులు, ఎమ్మెల్యేలు, ఎంపీ స్పందించి ఆయుష్ ఆస్పత్రి ప్రారంభమయ్యే 'మార్గం' చూపాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.



దారీతెన్నూ లేకుండా ఉన్న ఆసుపత్రి భవనం ఇలా..

ప్రారంభించే 'దారి' లేక..

తొలుత ఆయుష్ ఆస్పత్రి నిర్మాణానికి స్థలసేకరణ విషయంలో కాస్త అడ్డంకి ఎదురైనా.. వాటన్నింటినీ అధిగమిస్తూ ఎట్టకేలకు తొమ్మిదేళ్ల తర్వాత నిర్మాణం పూర్తయ్యింది. ఆయుష్ భవన నిర్మాణానికి తమ సొంత స్థలంలో రెండెకరాలు కేటాయించిన ప్రభుత్వ మహిళా పాలిటెక్నికల్ కళాశాల అధికారులు.. ఆ ఆస్పత్రికి వెళ్లే దారి విషయంలో మెలిక పెట్టారు. తొలుత ఈ ఆస్పత్రి రాకపోకలకు సంబంధించి జీపీటీలో ఆస్పత్రి నిర్మాణానికి కేటాయించిన స్థలంనుంచి నేరుగా కరణంగారి జంక్షన్ సమీపంలో ఉన్న కమల్‌వీర్ థియేటర్‌కు వెళ్లే మార్గాన్ని ప్రతిపాదిస్తూ జిల్లా అధికారులు నిర్ణయించారు. అదే ఆస్పత్రికి వెళ్లే ప్రధాన ద్వారమని తేల్చారు. ఆయుష్ ఆస్పత్రి నిర్మించిన చోటే.. తమ కళాశాల విద్యార్థినుల వసతి గృహం ఉన్నందున, ఆస్పత్రికి వైద్యంకోసం వచ్చే రోగులతో వారికి ఇబ్బంది కలిగే ప్రమాదం ఉందని, విద్యార్థినులకు అసౌకర్యంగా ఉంటుందని జీపీటీ ప్రిన్సిపాల్ అభ్యంతరం తెలిపారు. అంతకుముందు భవన నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు ఆ దారిని వినియోగించుకుంటామని ఆయుష్ అధికారులు అభ్యర్థించడంతో ఆయన ఆ అవకాశం కల్పించారు. దీంతో ఆ మార్గం నుంచే ఆస్పత్రి భవన నిర్మాణానికి సంబంధించిన మెటీరియల్ అన్నీ తరలించి నిర్మాణాన్ని పూర్తిచేశారు. తీరా నిర్మాణం పూర్తయ్యాక.. ఇటు వైపు వెళ్లేందుకు దారి లేదని జీపీటీ ప్రిన్సిపాల్ అభ్యంతరం తెలుపుతూ ఆయుష్ కమిషనర్‌కు నోటీసు పంపారు. దీనిపై స్థానిక ఆయుష్ అధికారులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఎంపీ ఉదయ్ శ్రీనివాస్‌కు కూడా తెలియజేశారు.

న్యూఢిల్లీలో ఎన్‌డీఎంఏ అధికారులతో కలెక్టర్ భేటీ

- ఉప్పాడ తీరం కోత నివారణకు నిధులు విడుదల చేయాలి
- ప్రత్యేకంగా ప్రజంటేషన్

కలెక్టరేట్(కాకినాడ),జూలై30(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ బుధవారం న్యూఢిల్లీలో జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్‌డీఎంఏ) అధికారులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. పిఠాపురం నియోజకవర్గంలో ఉన్న ఉప్పాడ తీర ప్రాంత కోత నివారణవల్ల ఆ ప్రాంతానికి కలుగుతున్న నష్టాన్ని ఉన్నతాధికారులకు వివరించారు. ఏటా సముద్రపు అలలు పోటెత్తడంవల్ల రోడ్లు, సారవంతమైన పొలాలు, ఇళ్లు ఎలా విచ్ఛిన్నం అవుతున్నాయో ఆయన ప్రత్యేకంగా వివరించారు. ప్రధానంగా కాకినాడ రూరల్ మండలంలోని నేమాంతోపాటు కొత్తపల్లి మండల పరిధిలోని కొమరిగిరి, సుబ్బంపేట, ఉప్పాడ, అమీనాబాద్‌ల్లో ఏ మేరకు నష్టం జరిగిందో కేంద్ర ఉన్నతాధికారులవద్ద ఆయన ప్రస్తావించారు. నేమాం నుంచి అమీనాబాద్ వరకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో గ్రోయిన్లు, డిఫ్లెక్టివ్ వాల్ వంటివి నిర్మించడానికి రూ.323కోట్లు నిధులు విడుదల చేయాలని కోరారు. ఈ నేపథ్యంలో ఎన్‌డీఎంఏ అధికారులు అడిగిన ప్రతి ప్రశ్నలను ఆయన వివరించి నివృత్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ న్యూఢిల్లీనుంచి ఫోన్‌లో ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా మాట్లాడారు. నిధులు మంజూరు విషయంలో ఎన్‌డీఎంఏ సానుకూలంగా స్పందించిందన్నారు. త్వరలో ఎన్‌డీఎంఏ అధికారులు అధికారిక ప్రజంటేషన్‌ను గవర్నమెంట్ ఆఫ్ ఇండియా అధికారుల నుంచి కోరతారన్నారు. అనంతరం నిధులు విడుదలకు అవకాశం ఉందన్నారు.

'అన్నదాత సుఖీభవ'కు బ్యాంకు ఖాతాల ఈకేవైసీ చేయించాలి

- జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా

కలెక్టరేట్(కాకినాడ), జూలై 30(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకం పొందడానికి జిల్లాలో అర్హులైన రైతులు తమ బ్యాంకు ఖాతాలకు ఎన్పీసీఎల్ లింక్, ఇన్ యాక్టివ్‌లోఉన్న బ్యాంకు ఖాతాలకు ఈకేవైసీ చేయించుకోవాలని జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో బుధవారం ఆయన రెవెన్యూ, వ్యవసాయం, లీడ్ బ్యాంకు, పోస్టాఫీస్ అధికారులతో అన్నదాత సుఖీభవ పథకంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతన్నలకు అన్నదాత సుఖీభవ పథకం కింద అందించనున్న ఆర్థిక సాయం అర్హులైన రైతులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రప్రభుత్వం ఆగస్టు 2న పీఎం కిసాన్ నిధుల తోపాటు అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుల ఖాతాల్లోకి రూ.7వేలు జమచేయనుందన్నారు.ఈ నేపథ్యంలో జిల్లాలో అర్హులైన రైతులు అందరూ తమ బ్యాంకుఖాతాలకు ఎన్పీసీఎల్ (నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) లింక్ చేసుకోవాలన్నారు. ఇన్‌యాక్టివ్‌లో ఉన్న బ్యాంకు ఖాతాలకు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. దీనిపై అధికారులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డీఆర్‌వో వెంకట్రావు, జిల్లా వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు విజయ్‌కుమార్, ఎల్‌డీఎం ప్రసాద్ పాల్గొన్నారు.

ఈ ఏడాది అడ్మిషన్లు పెరిగాయ్

ఇంటర్ విద్యలో నూతన సంస్కరణలపై సమీక్షలో డీఐఈవో శారద

కాకినాడరూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): గతేడాదికంటే ఈ విద్యాసంవత్సరం ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్లు బాగా పెరిగాయని కాకినాడ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారిణి (డీఐఈవో) ఐ.శారద తెలిపారు. ఇంటర్ విద్యలో 2025-26 విద్యా సంవత్సరంలో ఏపీ ప్రభుత్వం నూతనంగా తెచ్చిన విద్యా సంస్కరణలపై జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో బుధవారం కాకినాడ పీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమీక్షించారు.గతేడాది 3,267 అడ్మిషన్లు ఉండగా 2025-26 గానూ 3,888 మంది విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలు పొందారన్నారు.నూతన సంస్కరణ ల్లో భాగంగా సిలబస్, సబ్జెక్టుల కలయిక, ప్రశ్నాపత్రాలలో మార్పుల గురించి వివరించారు. నేషనల్ కరికులమ్ ఫ్రేమ్ వర్క్-2023, జాతీయ విద్యా విధానం- 2020, సిలబస్ రివిజన్, నూతన సబ్జెకుల కలయిక పరిచయం, ప్రశ్నాపత్రాల్లో మార్పులపై అవగాహన కల్పించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో గ్రూపు సబ్జెక్టులతో పాటు పేపర్-1గా ఆంగ్లం, ద్వితీయ భాషగా తెలుగు, సంస్కృతం, ఉర్దూ, అరబిక్, తమిళ్, కన్నడ, ఒడియా, పర్షియన్, ఫ్రెంచ్ లేదా ప్రధాన సబ్జెక్టులైన గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, హిస్టరీ, ఎకనామిక్స్, సివిక్స్, మైనర్ సబ్జెక్టులైన జాగ్రఫీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, మోడ్రన్ లాంగ్వేజ్, ఆంగ్లం, తెలుగు, ఉర్దూలో ఒక సబ్జెక్టు ఎంపిక చేసుకోవచ్చనన్నారు. ఏలేశ్వరం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్ మాట్లాడుతూ ఎంపీసీ విద్యార్థులు అదనపు సబ్జెక్టుగా ఆరో సబ్జెక్టు ఆప్షన్‌గా బయాలజీ, బైపీసీ విద్యార్థులు అదనపు సబ్జెక్టుగా గణితం ఎంపిక చేసుకోవచ్చన్నారు.పలు కళాశాలల ప్రిన్సిపాల్స్ అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. సమావేశంలో అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఐఈవో ఐ.శారద

నేటితో రెండో ఉచిత గ్యాస్ సిలిండర్ల బుకింగ్ క్లోజ్

- ఈరోజే బుక్ చేసుకోవాలి
- ఇంకా చేసుకోని వారు 1.80లక్షలమంది లబ్ధిదారులు
- రేపటినుంచి మూడో సిలిండర్

కలెక్టరేట్(కాకినాడ), జూలై 30 (ఆంధ్రజోతి): దీపం-2 పథకంలో రెండో ఉచిత గ్యాస్ సిలిండరు బుకింగ్ చేసుకోని లబ్ధిదారులు గురువారం బుకింగ్ చేసుకోండి. లేదంటే రెండో సిలిండరు పొందే అవకాశం కోల్పోతారు.ఈ మేరకు అధికార యంత్రాంగం ప్రకటించింది. రెండో గ్యాస్ సిలిండర్లను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 12.19 లక్షల మంది లబ్ధిదారులు బుకింగ్ చేసుకున్నారు. వీరి బ్యాంకు ఖాతాల్లోకి సబ్సిడీ సొమ్ము రూ.98.65కోట్లు జమ అయింది. ఇంకా సుమారు లక్షా80వేల మంది లబ్ధిదారులు బుకింగ్ చేసుకోవాల్సి ఉంది. త్వరితగతిన రెండో సిలిండరు బుకింగ్ చేసు కుని సబ్సిడీ సొమ్ములు పొందాలి. ఆగస్టు ఒకటో తేదీ నుంచి మూడో ఉచిత గ్యాస్ సిలిండరుకు బుకింగ్ చేసుకునే ప్రక్రియ ప్రారంభం అవుతుందని కాకినాడ జిల్లా పౌరసరఫరాలశాఖాధికారి రుద్రరాజు సత్యనారాయణ రాజు వెల్లడించారు. ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు నెలల్లో బుకింగ్ చేసుకోవచ్చునన్నారు. ఎవరికైనా సబ్సిడీ సొమ్ములు జమ కాకపోతే ఆయా జిల్లాల పౌరసరఫరాల శాఖ కార్యాలయాల్లో సంప్రదించాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న దీపం-2 పథకానికి ప్రజల్లో విశేష ఆదరణ లభించిస్తోందన్నారు.

ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్స్‌పై డీఎంహెచ్‌వో సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ నాయక్

జీజీహెచ్(కాకినాడ),జూలై30(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఉన్న పీహెచ్‌సీల సూపర్‌వైజరీ సిబ్బందితో జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయ సమావేశ మందిరంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ అధ్యక్షతన మంగళవారం అన్ని ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్స్ గురించి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ పీఎంజేఏవై సర్వే వంద శాతం అయ్యేలా చూడాలన్నారు. పీఎంవీవీవై ఎన్‌సీడీ 3.0 సర్వే, అసంక్రమిత వ్యాధులు ఆర్‌సీహెచ్, హెచ్‌ఎంఐఎస్, యూవిన్ పోర్టల్, ఎంఆర్ కాంపెయిన్ నేషనల్ డీవార్మింగ్ డే, టీబీ ముక్త భారత్, లెప్రసీ కేసులు, సీజనల్ వ్యాధులు, సైబర్ నేరాలకు సంబంధించి ఓటీపీ హెచ్చరికల గురించి, ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపులు ఎలా జరుగుతున్నాయో తెలుసుకున్నారు. అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరుపై సమీక్షించారు. ఎప్పటికప్పుడు అన్ని యాప్‌ల్లో వివరాల నమోదును పరిశీలించి నూటికి నూరుశాతం అమలయ్యేలా చూడాలన్నారు. సిబ్బంది సహకారాన్ని కోరుతూ వారికి సలహాలు, సూచనలు ఇచ్చారు. ముఖ్యంగా స్వర్ణఆంధ్ర పోర్టల్‌కి పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ గురించి విశదీకరించారు. జిల్లాలో ఫీల్డ్ లెవల్లో ఆశాకార్యకర్తల విధుల గురించి, ఈ ఆశా యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సిన ఈసీ విజిట్స్, హెచ్‌బీ, ఎన్‌సీ విజిట్స్, ఐఎఫ్ఏ విటమిన్ అడ్మినిస్ట్రేషన్ వీహెచ్ఎస్ఎన్‌డీ, వీహెచ్ఎస్ఎన్‌సీ విధుల నమోదు గురించి సమీక్షలో చర్చించారు. జిల్లాలో మాతృ, శిశు మరణాలను తగ్గించే దిశగా నివారణా చర్యలు ఎలా చేపట్టాలో తెలియజేశారు. మాతృమరణాలు అరికట్టడంలో కమ్యూనిటీ స్థాయి, ఫెసిలిటీ లెవల్‌లో తీసుకోవాల్సిన మెజర్స్ గురించి సూచనలు ఇచ్చారు. ముఖ్యంగా హైరిస్క్ గర్భిణులు తీసుకోవాలిసిన జాగ్రత్తల గురించి, గర్భం దాల్చిన నాటి నుంచి అన్ని వైద్య పరీక్షలు చేయించి ప్రసవానంతరం వరకు ఆమె వివరాలను జిల్లా యంత్రాంగానికి తెలియపర్చాలన్నారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ కేవీ సుబ్బరాజు, డాక్టర్ వి.అరుణ, డాక్టర్ జి.లక్ష్మి, డాక్టర్ ఎన్.ప్రశాంతి, డాక్టర్ విల్సన్, డాక్టర్ రవి, డిప్యూటీ ఎస్‌వో గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మహా క్రీడాసంబరానికి సర్వం సిద్ధం
- కాకినాడలో రేపటినుంచి 15వ హాకీ జూనియర్ ఉమెన్స్ నేషనల్ చాంపియన్‌షిప్-2025 పోటీలు 6



ఐటీ సెజ్‌ల్లో ఉద్యోగుల నివాస గృహాలకు స్థలాలు కేటాయించాలి 6
- లోక్‌సభ జీరో అవర్‌లో ప్రస్తావించిన కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్

మేధస్సుకు పరీక్ష



- విద్యార్థులకు జాతీయస్థాయిలో ప్రతిభాన్వేషణ పరీక్ష
- శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించేలా కేంద్రం ప్రోత్సాహం
- 'విద్యార్థి విజ్ఞాన్ మంథన్'కు దరఖాస్తుకు 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదివే విద్యార్థులకు అవకాశం
- ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు సెప్టెంబరు 30 వరకు గడువు



అమలాపురంలో విద్యార్థి విజ్ఞాన్ మంథన్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు, అధికారులు

(అమలాపురం రూరల్-ఆంధ్రజ్యోతి)

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక ఆలోచనలను ఆవిష్కరణల వైపు ప్రోత్సహించడంతోపాటు శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. విద్యార్థులు పాఠశాలస్థాయి నుంచి పరిశోధనల్లో రాణించేలా ఏటా కేంద్ర ప్రభుత్వం విద్యార్థి విజ్ఞాన్ మంథన్ పేరుతో జాతీయస్థాయిలో ప్రతిభాన్వేషణ పరీక్ష నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక సమాచార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈపరీక్షను ఎన్‌సీఈఆర్టీ, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియం, విజ్ఞాన భారతి సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న వారికి ఈ పరీక్ష నిర్వహిస్తారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు దేశ ప్రముఖ పరిశోధనా సంస్థల్లో ఇంటర్న్‌షిప్, ఉపకార వేతనాలు పొందే అవకాశం ఉంది.

సెప్టెంబరు 30 వరకు రిజిస్ట్రేషన్

విద్యార్థి విజ్ఞాన్ మంథన్ ప్రవేశపరీక్షలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులనుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఈ ఏడాది ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. సెప్టెంబరు 30 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు గడువు ఉంది. ప్రవేశ పరీక్ష ఆన్‌లైన్ పద్ధతిలో పాఠశాలస్థాయిలోనే నిర్వహిస్తారు. పరీక్ష జరిగేరోజు విద్యార్థులు వారికి అందుబాటులో ఉన్న ఆండ్రాయిడ్ మొబైల్, లాప్‌టాప్, డెస్క్‌టాప్, డిజిటల్ పరికరాల్లో ఏదైనా ఒకదాని ద్వారా పరీక్షకు నిర్దేశించిన దరఖాస్తును ప్లేస్టోర్ నుంచి డౌన్లోడ్ చేసుకుని వారి ఇంటి నుంచే పరీక్షకు హాజరయ్యే అవకాశం ఉంది.

రెండు విభాగాల్లో పరీక్ష..

పోటీ పరీక్షను జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహిస్తారు. 6వ తరగతి నుంచి 11వ తరగతి వరకు విడివిడిగా ఈ పరీక్ష నిర్వహిస్తారు. హిందీ, ఇంగ్లీషు భాషలతోపాటు దేశవ్యాప్తంగా ప్రాంతీయ భాషల్లో పరీక్ష రాసుకునే వెసులుబాటు ఉంది. మన విద్యార్థులు తెలుగు లేదా ఇంగ్లీషు భాషల్లో రాయవచ్చు. విద్యార్థి విజ్ఞాన్ మంథన్ పరీక్షకు సంబంధించి సెప్టెంబరు 1 నుంచి మాక్ పరీక్షలు నిర్వహిస్తారు. పాఠశాలస్థాయిలో ప్రధాన పరీక్ష అక్టోబరు 28 నుంచి 30 వరకు జరుగుతుంది. ఈ స్థాయిలో ఉత్తీర్ణులైన వారికి లెవెల్-2 ద్వితీయ పరీక్షను ఆన్‌లైన్‌లో ప్రోక్టరింగ్ విధానంలో పరిశీలకుల సమక్షంలో నవంబరు 19న జరుపుతారు. ఆయా పరీక్షలను ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 6 గంటల మధ్య 90 నిమిషాల వ్యవధిలో రాయాల్సి ఉంటుంది. పరీక్ష రాసే ప్రతి విద్యార్థి యాప్‌లో ఒక్కసారి మాత్రమే లాగిన్ అవుతారు.

వంద మార్కులకు పరీక్ష

విద్యార్థి విజ్ఞాన్ మంథన్ పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలోనే ఉంటుంది. లెవెల్-1 ప్రధాన పరీక్షలో ఆయా తరగతులకు సంబంధించిన వంద ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు చొప్పున వంద మార్కులు కేటాయిస్తారు. సెక్షన్-ఎలో విజ్ఞాన శాస్త్ర రంగంలో భారతీయ మేధావుల కృషిపై 20ప్రశ్నలు, సత్యేంద్రనాథ్‌బోస్ జీవితచరిత్ర నుంచి 20ప్రశ్నలు, సెక్షన్-బిలో 6 నుంచి 11 తరగతులకు సంబంధించి విద్యార్థులకు గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయోలజీ సబ్జెక్టుల నుంచి 50 ప్రశ్నలు, లాజిక్, రీజనింగ్ బుక్‌కు సంబంధించి 10ప్రశ్నలు ఉంటాయి. మొదటి విభాగంలో ఉత్తీర్ణులైన వారికి లెవెల్-2 ద్వితీయ పరీక్షలో 50 ప్రశ్నలు వంద మార్కులకు ఉంటాయి.

రాష్ట్రస్థాయికి ఎంపిక చేసేదిలా..

పాఠశాల స్థాయిలో ప్రాథమిక పరీక్ష రాసిన విద్యార్థుల్లో తరగతుల వారీగా ప్రతిభ చూపిన మొదటి 25మందిని ఎంపిక చేస్తారు. 6 నుంచి 11 తరగతులకుగాను మొత్తం 150మందిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారు. అందులో ప్రతిభ చూపిన ప్రతి తరగతి నుంచి ముగ్గురు చొప్పున మొత్తం 18మందిని జాతీయస్థాయికి ఎంపిక చేస్తారు. రాష్ట్రస్థాయి పరీక్ష డిసెంబరు 21, 28 తేదీల్లోగానీ జనవరి 4నగానీ ఏదో ఒకరోజు రాయాల్సి ఉంటుంది. రాష్ట్రస్థాయిలో ప్రతి తరగతినుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలతోపాటు మెమెంటో, సర్టిఫికెట్లను అందజేస్తారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థికి మెమెంటో, ప్రశంసాపత్రం అందజేస్తారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక ఇలా..

రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన ప్రతి తరగతి నుంచి మొదటి ఇద్దరు విద్యార్థులు వంతున 12మందిని ప్రతి రాష్ట్రం నుంచి జాతీయస్థాయికి ఎంపిక చేస్తారు. అందులో ప్రతి తరగతిలో ప్రతిభ చూపిన మొదటి ముగ్గురు విద్యార్థుల చొప్పున 18మందిని జాతీయస్థాయి విజేతలుగా ప్రకటిస్తారు. జాతీయస్థాయి విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.25వేలు, ద్వితీయ బహుమతి రూ.15వేలు, తృతీయ బహుమతిగా రూ.15వేలతోపాటు మెమెంటో, ప్రశంసాపత్రాలు అందజేస్తారు. నెలకు రూ.2వేల చొప్పున సంవత్సరంపాటు భాస్కర ఉపకార వేతనం కింద, రూ.24వేలు అందజేస్తారు. విద్యార్థి విజ్ఞాన్ మంథన్ 2025-26లో జాతీయ, జోనల్‌స్థాయి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు డీఆర్డీవో, ఇస్రో, సీఎస్ఐఆర్, బీఏఆర్సీ మొదలైన ప్రఖ్యాత జాతీయ ప్రయోగశాలలు, పరిశోధనా సంస్థల్లో ఒకటినుంచి మూడువారాలపాటు ప్రత్యేక శిక్షణ, ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహిస్తారు.

సృజనాత్మకతను వెలికితీయొచ్చు

-జీవీఎస్ సుబ్రహ్మణ్యం, జిల్లా సైన్స్ అధికారి



విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు విద్యార్థి విజ్ఞాన్ మంథన్ చక్కటి వేదికగా నిలుస్తుంది. సైన్స్ పట్ల అభిరుచిని పెంపొందించడంతో పాటు వారిని శాస్త్రవేత్తలుగా తయారు చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టింది. ఈ పరీక్షను ప్రభుత్వ, ఇతర యాజమాన్య ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు కూడా రాసుకునే అవకాశం కల్పించారు.

పాఠశాలనుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు

-షేక్ సలీంబాషా, డీఈవో, కోనసీమ జిల్లా



విద్యార్థులు వ్యక్తిగతంగానే కాకుండా పాఠశాల నుంచి కూడా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. పరీక్ష రాయడానికి ఆసక్తి ఉన్న విద్యార్థులను ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి. www.vvm.org.in వెబ్‌సైట్‌లో లాగిన్ అవ్వాలి. ప్రతి విద్యార్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పోటీతత్వాన్ని పాఠశాలస్థాయినుంచి పెంపొందించుకునేందుకు పరీక్ష దోహదపడుతుంది.



కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ప్రాక్టీస్‌లో పాల్గొన్న హాకీ క్రీడాకారులు

మహా క్రీడా సంబరానికి

సర్వం సిద్ధం

- కాకినాడలో రేపటి నుంచి 15వ హాకీ జూనియర్ ఉమెన్స్ నేషనల్ చాంపియన్‌షిప్-2025 పోటీలు
- 1నుంచి 12 వరకు మ్యాచ్‌లు
- పాల్గొననున్న 30 రాష్ట్రాల జట్లు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

మహా క్రీడాసంబరానికి, ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ఇలా రెండు ప్రధాన కార్యక్రమాలకు కాకినాడ ముస్తాబవుతోంది. ఆగస్టు 1వతేదీ నుంచి 12 వరకు కాకినాడ జిల్లా క్రీడామైదానంలో జరిగే 15వ హాకీ జూనియర్ ఉమెన్స్ నేషనల్ చాంపియన్‌షిప్-2025 పోటీలకు జోరుగా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఆగస్టు 3 నుంచి 20 వరకు జరిగే ఆర్మీ రిక్రూట్‌మెంట్‌కు సంబంధించి ర్యాలీ, వివిధ సామర్థ్య పరీక్షలు ఇక్కడ నిర్వహిస్తున్నారు.

పూర్తికావొచ్చిన ఏర్పాట్లు

జాతీయస్థాయి మహిళల జూనియర్ హాకీ పోటీలకు 30 స్టేట్ టీమ్స్ పాల్గొననున్నాయి. ఇప్పటికే కొన్ని టీమ్‌లు కాకినాడ చేరుకున్నాయి. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఆస్ట్రో టర్ఫ్ హాకీ ఫీల్డ్ ఉండడంతో గతంలో రెండుసార్లు జాతీయ పోటీలు ఇక్కడ విజయవంతంగా నిర్వహించారు. కలెక్టర్ షాన్‌మోహన్, జేసీ రాహుల్‌మీనా, డీఆర్‌వో వెంకటరావు, డీఎస్‌డీవో శ్రీనివాస్ నెలరోజులుగా ఈ పోటీల నిర్వహణ ఏర్పాట్ల కోసం శ్రమిస్తున్నారు. వచ్చేక్రీడాకారులకు ఏడుచోట్ల వసతి ఏర్పాట్లు చేశారు. క్రీడల నిర్వహణకు 38మంది జిల్లా విద్యాశాఖ పీడీలను ఏర్పాటు చేశారు. ప్రతి జట్టుకు 18మంది క్రీడాకారులు ఉంటారు. మెడికల్, మున్సిపాలిటీ, రెవెన్యూ, డీఎస్‌ఏ సిబ్బంది కలిపి 200మంది వరకు సేవలందించనున్నారు.

లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో..

మహిళల హాకీ పోటీలు లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో జరగనున్నాయి. సీ డివిజన్, బీ డివిజన్, ఏ డివిజన్ ఇలా వరుసగా పోటీలు నిర్వహిస్తారు. 12న హాకీ ఇండియా హయ్యర్ అఫీషియల్స్ రానున్నారు. రోజుకు 8మ్యాచ్‌లు జరుగుతాయి. ప్రతిరోజూ ఉదయం 5.30 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు షెడ్యూల్ ప్రకారం పోటీలు జరుగుతాయి.

హాకీ పోటీలకు ఏర్పాట్లు పూర్తి చేశాం

హాకీఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో,ఏపీ స్పోర్ట్స్ అథారిటీ, జిల్లా అడ్మినిస్ట్రేషన్ సంయుక్తంగా ఆగస్టు 1 నుంచి నిర్వహించే జాతీయస్థాయి హాకీ పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. ఈ పోటీలను రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి, శాప్ చైర్మన్ ఈ పోటీలను ప్రారంభించనున్నారు. ఈ పోటీల ద్వారా జూనియర్ వరల్డ్‌కప్ ఉమన్ హాకీ టీమ్‌ను ఎంపిక చేస్తారు.

-రవిరాజు, సంయుక్త కార్యదర్శి, రాష్ట్ర హాకీ అసోసియేషన్

ఏయే డివిజన్‌లో ఏయే టీమ్‌లు

డివిజన్-'ఏ'..

డివిజన్-'ఏ'లో.. నాలుగు పూల్స్ ఉంటాయి.
పూల్-ఏ: జార్ఖండ్, ఛత్తీస్‌ఘర్, కర్నాటక
పూల్-బీ: మధ్యప్రదేశ్,పంజాబ్, చండీఘర్
పూల్-సీ: హర్యానా, ఉత్తరప్రదేశ్, బెంగాల్,
పూల్-డీ: ఒడిశా, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్

డివిజన్-'బి'..

డివిజన్ 'బి'లో రెండు పూల్స్ ఉంటాయి
పూల్-ఏ: మణిపూర్, పుదుచ్చేరి, ఉత్తరాఖండ్, కేరళ, అస్సాం
పూల్-బీ: హిమాచల్, ఢిల్లీ, తమిళనాడు, అరుణాచల్ ప్రదేశ్, బీహార్

డివిజన్-'సి'..

డివిజన్-సీలో రెండు పూల్స్ ఉంటాయి.
పూల్-ఏ: దాద్రానగర్ హవేలీ, డామన్ అండ్ డయ్యూ, జమ్మూ అండ్ కశ్మీర్, గోవా, త్రిపుర జట్లు
పూల్-బీ: గుజరాత్, రాజస్థాన్, మిజోరం, తెలంగాణ

హాకీ క్రీడాకారులకు వసతి కేంద్రాలు

క్రీడాకారుల కోసం ఏడుచోట్ల వసతి సౌకర్యాలు ఏర్పాటు చేశారు. సామర్లకోటలోని ఈటీసీ శిక్షణకేంద్రం, సర్వే ట్రైనింగ్ అకాడమీ, టీటీడీసీ క్యాంపస్, కాకినాడ బాలాజీచెరువు సెంటర్ వద్ద ఉన్న అంబేడ్కర్ హాస్టల్ భవనం, జేఎన్‌టీయూకే ఉమెన్స్ హాస్టల్, అశోక్‌నగర్‌లోని జీపీటీ హాస్టల్, శ్యామ్ ఇనిస్టిట్యూట్, అచ్చంపేటలోని ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ క్యాంపస్‌ల్లో వారికి ఏర్పాట్లు ఉన్నాయి.

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

ఆగస్టు 3 నుంచి 20 వరకు జరిగే ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహణకు ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. శ్రీకాకుళం జిల్లా నుంచి ఎన్టీఆర్ జిల్లా వరకు 12జిల్లాల నుంచి అభ్యర్థులు ఈ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో పాల్గొననున్నారు. ఇప్పటికే ఆర్మీ ఎంపిక పరీక్ష రాసి ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఎంపిక ప్రక్రియ ఇక్కడ జరగనుంది. రోజుకు 800మంది ఈ రిక్రూట్‌మెంట్‌లో పాల్గొంటారు. అభ్యర్థులకు ముందుగా నెంబర్లు కేటాయించి 100మంది చొప్పున 1.6 కె.ఎం రన్నింగ్ పరీక్ష, అనంతరం మెడికల్ పరీక్షలు నిర్వహిస్తారు. 20రోజులపాటు జరిగే ఈ రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో 15వేలమంది పాల్గొనే అవకాశం ఉంది. ఆర్మీ అభ్యర్థులకు స్పోర్ట్స్ అథారిటీ ఆవరణలోనే వసతి కల్పించనున్నారు. ఆగస్టు 5 నుంచి అభ్యర్థుల ఎంపిక ప్రారంభం కానుంది.





హమ్మయ్య... గొంతు తడిసింది!

దాహార్తితో ఉంటే కళ్లెదుట ఏ నీరు కనిపిస్తే అదే అమృతం. అది మనుషులకైనా, జంతువులైనా. ఇక్కడ కనిస్తున్న దృశ్యం అదే విషయాన్ని ఆవిష్కృతం చేసింది. దాహంతో అలమటిస్తున్న ఆవుకు కాకినాడ జిల్లా గొల్లప్రోలు వాటర్ వర్క్స్‌లోని ఓవర్‌హెడ్ రిజర్వాయర్ పైపు నుంచి కారుతున్న నీటి ధార కనిపించింది. అక్కడకు చేరుకుని పైపు నుంచి వచ్చే నీటితో నాలుక తడుపుకుంది. బుధవారం సాయంత్రం కనిపించిన ఈ దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' క్లిక్ మనిపించింది.

... గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి)


లడ్డు ప్రసాదాన్ని పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు నందాజీ, రామయ్య

వాడపల్లి వెంకన్న ఆలయంలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

ఆత్రేయపురం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఫుడ్ సేఫ్టీ అధికారుల బృందం తనిఖీలు నిర్వహించింది. ఉభయ గోదావరి జిల్లాల అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ బీఏబీ నందాజీ, జిల్లా ఫుడ్ సేఫ్టీ డిజిగ్నేటెడ్ ఆఫీసర్ వై.రామయ్య లడ్డు, పులిహోర తయారీ కేంద్రాలను పరిశీలించారు. అన్నదాన సత్రంలో అన్నప్రసాదం తయారీతో పాటు అక్కడ సౌకర్యాలను చూశారు. లడ్డు, పులిహోర ఎలా ఉంటున్నాయని భక్తులను ఆరా తీశారు. జల ప్రసాదం ఆర్వో ప్లాంటును పరిశీలించారు. అనంతరం అధికారులు స్వామివారిని దర్శించుకున్నారు. వారికి వేద పండితులు ఆశీర్వచనం ఇవ్వగా ఈవో చక్రధరరావు స్వామివారి చిత్రపటాలను అందజేశారు.


అన్న ప్రసాదం ఎలా ఉందని భక్తుడిని అడిగి తెలుసుకుంటున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు. చిత్రంలో ఈవో సూర్యచంద్రరావు

చట్టసభల్లో వాటా కోసం యాదవులంతా ఏకమై

పోరాటం చేయాలి

జాతీయ అధ్యక్షుడు బుసగాని లక్ష్మయ్య పిలుపు


అఖిల భారత యాదవ సంఘం ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గం

కాకినాడ సిటీ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత యాదవ సంఘం ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాకినాడ జగన్నాథపురంలోని గొల్లపేట యాదవ కమ్యూనిటీ హాలులో బుధవారం ఉమ్మడి జిల్లా సంఘ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన జాతీయ అధ్యక్షుడు బుసగాని లక్ష్మయ్య మాట్లాడుతూ ఐక్యతతో ఎటువంటి హక్కులనైనా సాధించుకోగలమన్నారు. చట్టసభల్లో వాటాకోసం యాదవులంతా ఏకమై పోరాటం సాగించాలన్నారు. రాజ్యాధికారం దక్కినప్పుడే ఆర్థికంగా, రాజకీయంగా యాదవులు ఎదుగుతారన్నారు. అనంతరం ఉమ్మడి జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా యనమల రాజేష్, మన్నే కాశీవిశ్వేశ్వరరావు, అధ్యక్షుడిగా మన్నే నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా గింజాల రామకృష్ణ, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ అందరినీ కలుపుకుని యాదవుల సంక్షేమానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డు రమేష్, రాష్ట్ర రాజకీయ వ్యవహారాల చైర్మన్ గౌరుపర్తి శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వెంకటముని, రాష్ట్ర కార్యదర్శి కుప్పం రవిశంకర్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వీర్ల వెంకట సత్యనారాయణ, ప్రచార కార్యదర్శి చాట్ల మునిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఐటీ సెజ్‌ల్లో ఉద్యోగుల నివాస గృహాలకు

స్థలాలు కేటాయించాలి

లోక్‌సభ జీరో అవర్‌లో ప్రస్తావించిన కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 30 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఐటీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై పార్లమెంటు సమావేశాల్లో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ గళమెత్తారు. ఐటీ రంగాన్ని అభివృద్ధి చేసే లక్ష్యంతో దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటుచేస్తున్న ప్రత్యేక ఆర్థిక మండళ్ల (సెజ్)లో ఐటీ ఉద్యోగులకు ప్రత్యేకంగా నివాస గృహాల కోసం స్థలాలు కేటాయించాలని కోరారు. లోక్‌సభలో జీరో అవర్‌లో ఆయన ఈ అంశాన్ని లేవనెత్తారు. ఐటీ సేవల ఎగుమతుల్లో ప్రపంచంలోనే మన దేశం అగ్రగామిగా నిలుస్తోందన్నారు. 2005లో 23 బిలియన్ డాలర్లు కాగా 2025 నాటికి 200 బిలియన్ డాలర్లకు పెరిగిందన్నారు. 50లక్షల మందికి పైగా ఉద్యోగ అవకాశాలు లభించాయన్నారు. బెంగళూరు, హైదరాబాద్, గుర్గావ్, పూణే, చెన్నై నగరాల్లో ఐటీ శరవేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. అక్కడ పనిచేసే ఉద్యోగులకు నివాసం పెను సమస్యగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఐటీ ఉద్యోగులకు గృహాల నిర్మాణానికి స్పష్టమైన జాతీయ మార్గదర్శకాలు జారీ చేయాలని ఎంపీ కోరారు.



కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక సంస్థ అయిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని కాకినాడ జిల్లా పిఠాపురంలో ఏర్పాటు చేయాలని కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ కోరారు. బుధవారం ఆయన న్యూఢిల్లీలో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి కనుమూరి శ్రీనివాసవర్మ, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

తగ్గుతున్న గోదావరి ఉధృతి

- డెల్టా కాలువలకు పెరిగిన నీటి విడుదల
- 661 టీఎంసీల నీరు సముద్రంలోకి

ధవళేశ్వరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గోదావరి ఉధృతి క్రమంగా తగ్గుముఖం పడుతోంది. కాటన్ బ్యారేజ్ ధవళేశ్వరం, ర్యాలి ఆర్మ్‌ల్లోని మొత్తం గేట్ల 1.5 మీటర్లు, మద్దూరు, విజ్జేశ్వరం ఆర్మ్‌ల్లోని మొత్తం గేట్లను ఒక మీటరు మేర పైకి ఎత్తి 5,14,117 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో ధవళేశ్వరం వద్ద నీటిమట్టం 10 అడుగులుగా నమోదైంది. ఎగువన భద్రాచలం వద్ద తగ్గుముఖం పట్టిన నీటిమట్టం బుధవారం సాయంత్రానికి 31.2 అడుగులకు చేరుకుంది.

వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో వరినాట్లు ప్రారంభమైన దశలో వ్యవసాయ అవసరాలకు డెల్టా కాలువలకు నీటి విడుదలను పెంచారు. కాటన్ బ్యారేజీ నుంచి తూర్పు డెల్టాకు 4,800 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2,600 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 7,000 క్యూసెక్కులు చొప్పున మొత్తం 14,400 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

గోదావరికి వరద సీజను ప్రారంభమై జూన్, జూలైల్లో ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ నుంచి మొత్తం 661.82 టీఎంసీలను సముద్రంలోకి వృథాగా వదిలి వేశారు. జూన్‌లో వచ్చిన నీరు వ్యవసాయ అవసరాలకు పోను 10 టీఎంసీల మేర సముద్రంలోకి ప్రవహించింది. జూలైలో గోదావరికి రెండుసార్లు ఎగువ నుంచి 6లక్షల క్యూసెక్కులకు పైగా వరద ప్రవాహం తరలివచ్చింది. ఒక మోస్తరుగా తరలివచ్చిన వరదకే 650కిపైగా టీఎంసీలు సముద్రంలోకి పోయింది. ఈ నీటితో 60లక్షల ఎకరాలకు సాగునీరు, గ్రామాలకు తాగునీరు అందించవచ్చు.




మేఘ సందేశం!

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగరంలోని గోదావరి నదిపై... కోటిలింగాల రేవు వద్ద బుధవారం సాయంత్రం మబ్బులు ఇలా అందంగా కమ్ముకున్నాయి. వీటిని చూసినవారికి ఎండను తగ్గించి చల్లని వాతావరణం ఇచ్చేందుకు వచ్చాం అనే సందేశం ఇచ్చినట్టు అనిపిస్తుందంటే అతిశయోక్తి కాదేమో.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

సత్యదేవుడి హుండీల ఆదాయం రూ.1.57 కోట్లు


హుండీలలో కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

అన్నవరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలోని హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించగా రూ.1,57,09,001 నగదు, 35 గ్రాముల బంగారం, 659 గ్రాముల వెండి సమకూరాయి. వీటితో పాటుగా యూఎస్ఏకు చెందిన 125 డాలర్లు, ఇంగ్లాండ్ 20 పౌండ్స్, సింగపూర్ 30 డాలర్లు, యుఏఈ 90 దిరహమ్స్, రష్యన్ 50 రూబీలు లభించాయి. లెక్కింపును ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్ పర్యవేక్షించగా సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు. 35 రోజులకు ఈ ఆదాయం లభించగా సరాసరిన రోజుకు రూ.4.48 లక్షల ఆదాయం హుండీలలో భక్తులు సమర్పించుకున్నారు.

టిప్పర్ లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం


ఫైల్‌ఫొటో


లారీ చక్రాల మధ్యలో చిట్టిరాజు మృతదేహం

రాజానగరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): టిప్పర్ లారీ డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగం వల్ల వ్యక్తి దుర్మరణం చెందాడు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని కోటిలింగాలపేటకు చెందిన బత్తుల చిట్టిరాజు (52) గుమ్మళ్లదొడ్డిలోని పీఎంఏజే ఇండస్ట్రీస్ లిమిటెడ్ కంపెనీలో మెకానికల్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో రోజూ మాదిరిగానే బుధవారం ఇంటి నుంచి ఆఫీస్‌కు మోటార్‌సైకిల్‌పై బయలుదేరిన చిట్టిరాజును మార్గమధ్యంలో కొంతమూరు కళ్యాణ్‌నగర్ వద్ద అతివేగం, నిర్లక్ష్యంగా వస్తున్న టిప్పర్‌లారీ వెనుకవైపు నుంచి బలంగా ఢీకొని కొంతదూరం ఈడ్చుకుంటూ వెళ్లిపోయింది. చిట్టిరాజు లారీ చక్రాల మధ్యలో ఇరుక్కుపోయి నుజ్జునుజ్జయ్యి మరణించాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు రాజానగరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి భార్య లీల ఫిర్యాదుతో రాజానగరం ఎస్ఐ ప్రియకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భవనంపై నుంచి పడి పెయింటర్ మృతి


మృతిచెందిన జ్ఞానకుమార్

సీతానగరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం చినకొండేపూడి గ్రామంలో భవనం పై పెయింట్ పనిచేస్తుండగా ప్రమాదపు శాత్తు కింద పడి వంగలపూడి గ్రామానికి చెందిన అల్లం సతీష్ జ్ఞానకుమార్ (46) మృతిచెందాడు. సీతానగరం హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు.. బుధవారం చినకొండేపూడిలో అడపా తిరుపతిరావు ఇంటి పై అంతస్తుకు పరంజీలు కట్టుకుని దానిపై నిలబడి పెయింటింగ్ వేస్తుండగా ప్రమాదపుశాత్తు పరంజి తెగిపోవడంతో పై నుంచి రోడ్డుపై పడి జ్ఞానకుమార్ తలకు తీవ్ర గాయమైంది. తోటి పనివారు కుటుంబ సభ్యులకు తెలియపరిచి చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. జ్ఞానకుమార్ భార్య అల్లం దేవి భవాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

పేలిన గ్యాస్ సిలిండర్

భీమక్రోసుపాలెంలో వ్యక్తి పరిస్థితి విషమం

ద్రాక్షారామ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం భీమక్రోసుపాలెంలో మంగళవారం రాత్రి అనిశెట్టి సుబ్బలక్ష్మీ ఇంటి స్టోర్‌రూమ్‌లో గ్యాస్ సిలిండర్ పేలింది. ఫైర్ అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో అనిశెట్టి సుబ్బలక్ష్మీ చెందిన ఇంటి వంటగదికి చేర్చి మేడమెట్ల కింద స్టోర్‌రూమ్‌లో విద్యుత్‌మీటరు, కట్టెల పొయ్యి ఉంది. గదిలో కట్టెలు, పూర్తి గ్యాస్ నిండి ఉన్న అదనపు సిలిండర్ ఉన్నాయి. రాత్రి 11 గంటల ప్రాంతంలో స్టోర్ రూమ్‌లో మంటలు చెలరేగాయి. దీంతో సమీపంలో ఉన్నవారు కేకలు వేయడంతో ఇంట్లో నుంచి సుబ్బలక్ష్మీ, కుటుంబీకులు బయటకు వచ్చేశారు. మంటల్లో గ్యాస్ సిలిండర్ ఉండటంతో ఒక్కసారిగా పేలిపోయింది. వారికి సాయం చేసేందుకు వెళ్లిన పితాని చినబాబు తీవ్రంగా గాయపడ్డాడు. అగ్నిమాపకదళ అధికారి కె.వెంకటరెడ్డి ఘటనా స్థలానికి చేరుకున్నారు. చినబాబును కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్టు చెప్తున్నారు. పేలుడు ధాటికి ఇంటి వంటగది గోడలు ధ్వంసమై మేడమెట్లు కూలిపోయాయి. రూ.2 లక్షల నష్టం సంభవించినట్టు చెప్తున్నారు.


సిలిండర్ పేలుడుకు ధ్వంసం అయిన ఇంటి గోడలు

చెరువులో పడి వ్యక్తి మృతి



జగ్గంపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట మంచి నీటి చెరువులో పడి వ్యక్తి మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జగ్గంపేట టవర్ కాలనీకి చెందిన ఇల్ల డేవిడ్‌రాజ్ (40) పంచాయతీ కార్యాలయంలో పారిశుధ్య సిబ్బందిగా పనిచేస్తున్నాడు. మద్యం తాగి చెరువులో పడిపోవడంతో మృతి చెందాడని స్థానికులు తెలిపడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం తరలించారు. కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

చింతూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్టు ఎస్ఐ రమేష్ తెలిపారు. బుధవారం తమకు అందిన సమాచారం మేరకు అల్లూరి జిల్లా చింతూరు మండలం కల్లేరు సీలేరు నది ఒడ్డున మృతదేహం ఉన్నట్టు గుర్తించామన్నారు. మృతదేహంపై గులాబీ రంగు టీషర్టు, బూడిద రంగు షార్ట్ ఉన్నాయని.. మృతుడికి 30 నుంచి 35 ఏళ్లు ఉండవచ్చన్నారు. కేసు నమోదు చేశామన్నారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే చింతూరు పోలీసు స్టేషన్లో సంప్రదించాల్సిందిగా ఎస్ఐ కోరారు.

చోరీ కేసుల్లో ఇద్దరి అరెస్టు

63 గ్రాముల బంగారం స్వాధీనం

అన్నవరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కత్తిపూడిలో ఈఏడాది జనవరి నెలాఖరున జరిగిన రెండు వేర్వేరు చోరీ కేసుల్లో నిందితులను బుధవారం అన్నవరం ఎస్ఐ హరిబాబు కత్తిపూడిలో అరెస్టు చేశారు. నర్సీపట్నం మండలం కె.ఎల్ పురానికి చెందిన గెడ్డం రామ్ నవీన్, నర్సీపట్నంకు చెందిన మారి అలెక్స్ చెడు అలవాట్లకు బానిసై చోరీల బాటపట్టారని పేర్కొన్నారు. వారిని అరెస్ట్ చేసి 63 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు. మరో నిందితుడు రౌతు మల్లేష్‌ను అరెస్టు చేయాల్సి ఉందని చెప్పారు.


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ హరిబాబు

కీచక కరస్పాండెంట్ అరెస్ట్


రాయవరం పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న ట్రైనీ డీఎస్పీ, సీఐ

రాయవరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థినిని బెదిరించి లోబర్చుకుని గర్భవతిని చేసిన కీచక స్కూల్ కరస్పాండెంట్ ఆకుమర్తి జయరాజ్‌ను అరెస్టు చేసినట్టు ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి తెలిపారు. బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. సోమేశ్వరం శివారు రెడ్డి కృష్ణమ్మపేటకు చెందిన ఆకుమర్తి జయరాజ్ రాయవరం మండలంలోని ఓ గ్రామంలో స్కూల్ నిర్వహిస్తున్నాడు. అదే స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న బాలికను ఈ ఏడాది మార్చి 26న తన ఆఫీసు రూమ్‌లోకి పిలిపించుకుని అలమారలో ఫైల్స్ తీయమని చెప్పాడు. తర్వాత నోరునొక్కి, కేకలు వేస్తే చంపేస్తానని బెదిరించి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలికకు నెలసరి రాకపోవడంతో ఈనెల 28న తల్లిదండ్రులు వైద్య పరీక్షలు చేయించగా గర్భవతి అని తేలింది. దీంతో బాలిక తల్లిదండ్రులు రాయవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని బుధవారం రామచంద్రపురం మండలం కొత్తూరు శివారు జంక్షన్ వద్ద వీఆర్వో సమక్షంలో అదుపులోకి తీసుకున్నట్టు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు, ఎస్ఐ డి.సురేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు. నిందితుడిని అరెస్టు చేసిన ట్రైనీ డీఎస్పీ, సీఐ, ఎస్ఐలను కోనసీమ జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, అదనపు ఎస్పీ ఏవీఆర్‌బీ ప్రసాద్, డీఎస్పీ రఘువీర్ తదితరులు అభినందించారు.

భార్యను హతమార్చిన భర్త అరెస్ట్


రాజానగరం పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీకాంత్, సీఐ

రాజానగరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): భార్యను విచక్షణా రహితంగా నాపరాయితో తలపై మోది కడతేర్చిన భర్తను రాజానగరం పోలీసులు అరెస్టు చేశారు. తూర్పుగోదావరి జిల్లా కొంతమూరు సంతోష్‌నగర్‌లో ఈ నెల 27న జరిగిన మహిళ హత్య కేసు వివరాలను రాజానగరం పోలీస్‌స్టేషన్‌లో బుధవారం నార్త్ జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ స్థానిక సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్‌తో కలిసి వెల్లడించారు. వేమగిరి ఉషారాణి అలియాస్ చిన్నారి(28)కి సుమారు పదేళ్ల కిందట నర్సీపట్నం దగ్గరలోని గిడుతురు గ్రామానికి చెందిన వేమగిరి మాణిక్యంతో వివాహం జరిగింది. వారికి కుమారుడు, కుమార్తెలు ఉన్నారు. వివాహం అయినప్పటి నుంచి భార్య పిల్లలు కొంతమూరు సంతోష్‌నగర్‌లోనే అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. మాణిక్యం వెల్డింగ్ పనిచేసేవాడు. ఈనేపథ్యంలో ఉషారాణిపై అనుమానంతో మాణిక్యం తరచూ వేధింపులకు గురిచేసేవాడు. ఈ విషయమై నెలరోజుల కిందట రాజానగరం పోలీస్‌స్టేషన్‌లో భార్యభర్తల గొడవ కేసు నమోదు చేశారు. ఉషారాణి కేసు పెట్టినప్పటీ నుంచి మాణిక్యం కుటుంబాన్ని పట్టించుకోకుండా సరిగ్గా ఇంటికి రాకుండా అక్కడక్కడా తిరుగుతూ భార్యపై అనుమానం మరింత ఎక్కువ పెంచుకున్నాడు. దీంతో ఈ నెల 26న రాత్రి 11.30 గంటల సమయంలో ఇంటికి వచ్చి భార్యతో గొడవపడి నాపరాయితో ముఖంపై బలంగా కొట్టి హతమార్చి పరారయ్యాడు. ఈ మేరకు ఉషారాణి తల్లి నలమాటి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితుడు మాణిక్యంను 28న సాయంత్రం అరెస్టు చేశారు. నిందితుడిని పట్టుకున్న సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్‌తో పాటుగా ఎస్ఐ కెవి నాగార్జున, ఎస్ఐ నారాయణమ్మ, సిబ్బంది నరేష్‌బాబు, రాంప్రసాద్, అశోక్‌లను ఎస్పీ నరసింహకిషోర్ అభినందించారు.

చిరు వ్యాపారి ఆత్మహత్యాయత్నం


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దొబ్బడి పెద్దిరాజు

నల్లజర్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా దూబచర్ల డైట్ కళాశాలకు వెళ్లే మార్గం వద్ద ఓ చిన్న దుకాణం నడుపుతున్న దొబ్బడి పెద్దిరాజు బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గత 15 ఏళ్లుగా ఇక్కడే పాన్ షాపు నిర్వహిస్తున్నాడు. బుధవారం పంచాయతీ కార్యదర్శి ఆశ అలైఖ్య పోలీసు సిబ్బందితో ఆ ప్రాంతాన్ని ఖాళీ చేసే ప్రయత్నం చేయగా తన జీవనాధారం పోతుందని ఇంటికి వెళ్లి పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే నల్లజర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్య నిమిత్తం తాడేపల్లిగూడెం ఆసుపత్రికి తరలించారు. దీనిపై కార్యదర్శి ఆశ అలైఖ్యను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా కొట్టు వద్ద చెట్టు ఉండడం వల్ల వాహనరాకపోకలకు అంతరాయం ఏర్పాడుతుందని గ్రామానికి చెందిన కొంతమంది ఫిర్యాదు చేయడంతో అనేకసార్లు చెట్టు కొమ్మలను తొలగించాలని చెప్పినాపట్టించుకోలేదన్నారు. లైన్‌మెన్, పోలీసులు చెట్టును తొలగించేందుకు వెళ్లగా కొట్టు తీసేస్తున్నారని చెప్పి అబద్ధాలు చెప్పాడన్నారు. ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించినట్టు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.

దాడి కేసులో వ్యక్తికి ఏడేళ్ల జైలు శిక్ష

రాజమహేంద్రవరం సిటీ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కడియం పోలీస్ స్టేషన్ పరిధిలో మాధవరాయుడు పాలెంలో బొల్లా ధనుంజయ అలియాస్ డీజెఎస్‌పై డ్రింక్ సీసాతో దాడి చేసిన ముంజేటి సురేష్ అనే వ్యక్తిపై నేరం రుజువు కావడంతో ఏడు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ రాజమహేంద్రవరం ఎనిమిదో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి వై.బెన్నయ్యనాయుడు తీర్పునిచ్చారు. 2024లో జరిగిన ఈ సంఘటనపై అప్పట్లో కడియం పోలీసులు కేసు నమోదు చేశారు. మద్యం మత్తులో సురేష్ ఈ దాడి చేసినట్టు అప్పటి సీఐ టి.కృష్ణసాయి కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ ఫైల్ చేశారు. ఈ కేసులో సాక్షులను ప్రస్తుత కడియం సీఐ ఎ.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో కోర్టు కానిస్టేబుల్ కే.శ్రీనివాస్ కోర్టులో హాజరుపరిచారు. అడిషనల్ పీపీ కే.రాధాకృష్ణరాజు వాదన వినిపించారు. న్యాయమూర్తి తుది తీర్పును వెల్లడించారు. నిందితుడికి ఏడు సంవత్సరాలు జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధించారు.

మహిళను వేధించిన ఇద్దరిపై కేసు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మహిళను వేధించిన కేసులో ఇద్దరిపై బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్‌చెరువు గ్రామానికి చెందిన కే లక్ష్మి అనే మహిళకు ఈనెల 9న రాత్రి 11:30 గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు ఫోను చేసి బెదిరింపులకు గురిచేయ్యడమే కాకుండా వాట్సాప్ గ్రూప్‌లలో అసభ్యకరంగా వాయిస్ మెసేజ్‌లు పెట్టి అవమానించారని ఈనెల 29న పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో బొమ్మూరు పోలీసులు మునగాలకు చెందిన జీ.సుమంత్, పెద్దాపురానికి చెందిన ఎం.రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దూడలపై కుక్కల దాడి

ఆలమూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం పెదపళ్లలో కుక్కలు గేదె దూడలపై దాడి చేసి తీవ్రంగా గాయపరచాయి. వీటిలో ఒకటి మృత్యువాత పడగా మరో రెండికి వైద్యం అందిస్తున్నారు. ఇలా అయితే పశువుల పెంపకం ఇబ్బందికరంగా మరుతుందని పెంపకందారులు అంటున్నారు. 2 రోజులుగా జరిగిన దాడుల్లో గాయపడిన దూడలకు ఆలమూరు ఏడీ ఎల్.అనిత ఆధ్వర్యంలో వైద్యులు భానుప్రకాష్ వైద్యం అందిస్తున్నారు


పెదపళ్లలో గాయపడిన దూడలను పరిశీలిస్తున్న వైద్యులు

కార్మికుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

వడ్రంగి కార్పొరేషన్ ఏర్పాటును ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా : మంత్రి సుభాష్


వడ్రంగుల రాష్ట్ర స్థాయి సమావేశంలో ఐక్యత ప్రదర్శిస్తున్న మంత్రి, ప్రతినిధులు

అమలాపురం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని, వడ్రంగుల సమస్యల పరిష్కారంలో భాగంగా వడ్రంగి కార్పొరేషన్ ఏర్పాటును ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ హామీ ఇచ్చారు. ఏపీ కార్పెంటర్ అసోసియేషన్ 8వ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సభ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని వాసర్ల గార్డెన్స్‌లో బుధవారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ వడ్రంగి మేస్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తానని, ఏ కార్మికుడికి కష్టం వచ్చినా తనను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. వడ్రంగి మేస్త్రీల అసోసియేషన్‌కు ఉమ్మడి జిల్లాలో భవనం ఉండేదని, కోనసీమలో కూడా భవనం మంజూరు చేయాలని వడ్రంగి అసోసియేషన్ చేసిన విజ్ఞప్తికి మంత్రి సానుకూలంగా స్పందించారు. కార్మికుల విజ్ఞప్తి మేరకు ప్రత్యేక కార్పొరేషన్ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన ప్రతినిధులు నూతన అధ్యక్షుడు కమిటీ సభ్యులను ఎన్నుకుని మంత్రి సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయించారు. రాష్ట్ర కార్పెంటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తాడికొండ రంగబాబు, ప్రధాన కార్యదర్శిగా నరసింహమూర్తి, ఉపాధ్యక్షుడిగా గానాల సత్యసాయితో పాటు నూతన కార్యవర్గాన్ని మంత్రి అభినందించారు.

గంజాయితో ఐదుగురి అరెస్టు

2.57 కిలోల గంజాయితో పాటు మోటారు సైకిల్, రూ.1500 నగదు స్వాధీనం

సీతానగరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం నల్గొండ శివారున గంజాయితో ఐదుగురిని అరెస్ట్ చేసినట్టు నార్త్‌జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ తెలిపారు. బుధవారం సీతానగరం పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు నార్త్‌జోన్ డీఎస్పీ, శ్రీకాంత్ కోరుకొండ సీఐ వై.సత్యకిషోర్ పర్యవేక్షణలో సీతానగరం ఎస్ఐ డి.రామ్‌కుమార్ దాడి చేశారు. నల్గొండ శివారున గంజాయి రవాణా చేస్తున్న అదే గ్రామానికి చెందిన చింతల గంగరాజు, బండారు అప్పన్నదొర, తొర్రేడు గ్రామానికి చెందిన తాటిపాక గణేష్, కడియం మండలం మురమండకు చెందిన నేరుమిల్లి అఖిల్, సీతానగరం మండలం బొబ్బిల్లంకకు చెందిన పోలిన సాయి సతీష్‌ను నల్గొండ శివారు మామిడి తోటల వద్ద అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 2.57 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీఆర్వో సమక్షంలో ఐదు గంజాయి ప్యాకెట్లు, మోటారు సైకిల్, రూ.1500 నగదు స్వాధీనం చేసుకున్నట్టు, కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్టు పోలీసులు పేర్కొన్నారు. గంజాయిని ఒడిస్సా ఏజెన్సీ ప్రాంతం నుంచి కొనుగోలు చేసి ఇక్కడకు తీసుకొచ్చి చిన్న ప్యాకెట్లుగా చేసి విక్రయాలు చేస్తున్నట్టు వారు తెలిపారు.


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, సీఐ, ఎస్ఐ

'ఫారెస్ట్ రేంజర్ ఆఫీసును కోరింగకి తరలించాలి'

తాళ్లరేవు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కోరింగ ఫారెస్ట్ రేంజర్ ఆఫీసును కోరింగ ఫారెస్ట్ బంగ్లా ప్రాంగణంలోకి తరలించాలని పలువురు డిమాండ్ చేశారు. ఈ కార్యాలయం కాకినాడలో ఉంటే అధికారులు కోరింగలో విధులు నిర్వర్తిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి కార్యాలయ తరలింపునకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పులిమేరు పీఏసీఎస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపడుతున్న రామస్వామి (బాబు)

'సమిష్టి కృషితో సహకార సంఘాల బలోపేతం'

పెద్దాపురం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సమిష్టి కృషితోనే సహకార సంఘాలు బలోపేతమవుతాయని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. పులిమేరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం నూతన అధ్యక్షుడిగా తుమ్మల రామస్వామి (బాబు) మంగళవారం ప్రమాణం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన చినరాజప్ప మాట్లాడుతూ పీఏసీఎస్‌ల బలోపేతానికి డీసీసీబీ, ఆప్కాబ్ కృషి చేస్తున్నాయని, అందుకు అనుగుణంగా పాలకవర్గ సభ్యులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రైతు సంక్షేమ కార్యక్రమాలు, సహకార బ్యాంకులు అందిస్తున్న రుణాలు, రాయితీలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. తుమ్మల బాబు మాట్లాడుతూ రైతులకు ఆమోదయోగ్యమైన విధానాలను సంఘం ద్వారా అమలు చేస్తామన్నారు. ఎరువులు, పురుగు మందులు, రుణాలను సకాలంలో అందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.



జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాతో భేటీ అయిన మాజీ ఎమ్మెల్యే వర్మ

'రాజుల చెరువు రైతుల సమస్యలను పరిష్కరించాలి'

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 30 (ఆంధ్రజ్యోతి): యు.కొత్తపల్లి మండలం కొమరగిరి పంచాయతీ పరిధిలోని రాజుల చెరువు రైతుల సమస్యలను పరిష్కరించాని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాను పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ కోరారు. బుధవారం ఆయన జేసీని కలిసి ఈ మేరకు విన్నవించారు. రాజుల చెరువు పరిధిలోని రైతులు 70 సంవత్సరాలుగా పంటలు సాగు చేసుకుంటున్నారని, కొంతమంది కబ్జాదారులు ఆ స్థలాలను ఆక్రమించుకోవడానికి చూస్తున్నారని వివరించారు. తప్పుడు ఫిర్యాదులు చేయడం వల్లే అధికారులు సాగును అడ్డుకున్నారన్నారు. రైతులు తమ వద్ద ఉన్న ఆధారాలు చూపించారని చెప్పారు. రైతులకు ఇబ్బంది కలుగచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యను పరిష్కరిస్తామని జేసీ హామీ ఇచ్చారు. అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

పొలం సాగు చేస్తుంటే

దౌర్జన్యానికి దిగారు

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పందించి రక్షణ కల్పించాలి



కౌలుకు తీసుకున్న పొలాన్ని సాగు చేసుకోనివ్వట్లేదంటున్న ప్రజ్ఞాన్‌కుమార్, ఇతర రైతులు

పిఠాపురం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలతో అధికారులు స్వాధీనపరిచిన భూమిలో పంటలు సాగు చేయనివ్వకుండా పిఠాపురం మండలం మల్లాం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు రౌడీలతో కలిసి అడ్డుకోవడంతో పాటు తనపై దౌర్జన్యం చేశారని కౌలు రైతు పి.ప్రజ్ఞాన్‌కుమార్ పిఠాపురం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పిఠాపురం మండలం మల్లాం, జల్లూరు గ్రామాల్లో ఉన్న ఎనిమిది ఎకరాల భూమిని తొలుత కుంపట్ల మణిరత్నం, తర్వాత దానిని కొనుగోలు చేసిన కోడూరి నాగనరసింహరావు నుంచి కౌలుకు తీసుకుని తాము సాగు చేసుకుంటున్నామని ప్రజ్ఞాన్‌కుమార్ తెలిపారు. గతంలో ఇదే ఇద్దరు వ్యక్తులు సాగుకు అడ్డంకులు సృష్టించగా వీడియో ద్వారా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను కోరగా ఆయన సానుకూలంగా స్పందించి కాకినాడ జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు ఇవ్వడంతో పంటలు సాగు చేసుకోగలిగామని వివరించారు. ఈ ఏడాది తాను పొలాన్ని దమ్ము చేయగా, వారు వచ్చి తనపై దౌర్జన్యం చేయడంతో పాటు పొలంలో వరి విత్తనాలు చల్లారని తెలిపారు. తనపై దాడి చేసి బెదిరిస్తున్న మల్లాంకు చెందిన వ్యక్తులు, ఇతర ప్రాంతాల రౌడీల నుంచి రక్షణ కల్పించాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, కలెక్టర్, ఎస్పీలను కోరుతున్నట్టు చెప్పారు.



రికార్డులను పరిశీలిస్తున్న సమగ్ర శిక్షా సీఎంవో నాగేశ్వరరావు

'బయోమెట్రిక్ అథంటికేషన్‌ను త్వరితగతిన పూర్తి చేయాలి'

గొల్లప్రోలు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అందించిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థిమిత్ర కిట్లకు సంబంధించిన బయోమెట్రిక్ అథంటికేషన్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని సమగ్ర శిక్షా సీఎంవో చామంతి నాగేశ్వరరావు సూచించారు. గొల్లప్రోలు మండల విద్యా వనరుల కేంద్రంలోని రికార్డులను బుధవారం ఆయన పరిశీలించారు. గొల్లప్రోలు మండలంలో 4,180 బయోమెట్రిక్ కిట్లకు 3,990 కిట్లు బయోమెట్రిక్స్ పూర్తి కావడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు గ్రీన్ పాస్‌పోర్టుల జారీ, అమ్మ పేరుతో మొక్కలు నాటడం తదితర అంశాలపై సమీక్షించారు. సమగ్ర శిక్షా ఏఎస్‌వో జోగిరెడ్డి, పిఠాపురం ఎంఈవో శివప్రసాద్, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.



లబ్ధిదారుడికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేస్తున్న జనసేన ఇన్‌చార్జి శ్రీనివాసరావు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

పిఠాపురం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంతో పాటు మండలంలోని ఎఫ్‌కే పాలెం, జల్లూరు, మల్లాం, విరవ, నరసింగపురం, భోగాపురం, రాపర్తి, రాయవరం, వెల్దుర్తి గ్రామాలకు చెందిన 12 మంది లబ్ధిదారులకు రూ.6.85 లక్షలు మంజూరయ్యాయి. జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు బుధవారం ఆయా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి చెక్కులు అందజేశారు.

లాభదాయక ఆయిల్‌పామ్ సాగు చేపట్టాలి

కాకినాడ రూరల్ ఎమ్మెల్యే నానాజీ



వేములవాడలో ఆయిల్‌పామ్ తోటల విస్తరణ మహోత్సవ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నానాజీ

కరప, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఉద్యానవన శాఖ ప్రోత్సాహంతో రైతులు లాభదాయకమైన ఆయిల్‌పామ్ సాగు చేపట్టాలని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ సూచించారు. మండలంలోని వేములవాడలో బుధవారం ఉద్యానవన శాఖ, సర్వే సాయి ఎడిబుల్ ఆయిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఆయిల్‌పామ్ తోటల విస్తరణ మహోత్సవ సభలో ఆయన మాట్లాడారు. ఆయిల్‌పామ్ సాగుకు శ్రీకారం చుట్టిన రైతు యార్లగడ్డ భూపాల్‌ప్రసాద్‌ను ఎమ్మెల్యే అభినందించారు. అంతకు ముందు అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయిల్‌పామ్ మొక్కలను నాటారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కమిడి మంగాదేవి, సాదే ఆశాజ్యోతి, జిల్లా ఉద్యానవన శాఖాధికారి జి.విజయలక్ష్మి, ఏడీ కె.బాబూరావు, సర్వేసాయి జనరల్ మేనేజర్ ప్రభాకరరావు, మైక్రో ఇరిగేషన్ అధికారి వరప్రసాద్, హార్టికల్చర్ ఆఫీసర్ వైఎస్ రాజశేఖర్, వేములవాడ, కూరాడ, కరప సొసైటీల చైర్మన్లు దూడల నారాయుడు, వెలుగుబంట్ల సూరిబాబు, సైనవరపు భవానీశంకర్, ఎంపీడీవో మట్టపర్తి అనుపమ, తహసీల్దారు తుమ్మల దుర్గాప్రసాద్, ఏవో ఇమ్మిడిశెట్టి సత్య, ఇరిగేషన్ ఏఈ నాగభవానీ, హౌసింగ్ ఏఈ పెండెం నాగేష్, నాయకులు బండారు మురళి, బోగిరెడ్డి కొండబాబు, గంగాధర్, మీసాల రాంబాబు, పాలిక సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.





గొల్లప్రోలు మండలం దుర్గాడ, సామర్లకోట మండలం దోమాడపాకలులో కరపత్రాలు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ, ఎమ్మెల్యే చినరాజప్ప

'అభివృద్ధి, సంక్షేమాలకు చిరునామా టీడీపీ'

సామర్లకోట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు టీడీపీ చిరునామాగా మారిందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా మండలంలోని వేట్లపాలెం, దోమాడపాకలులో బుధవారం ఆయన టీడీపీ, జనసేన నాయకులతో కలిసి పర్యటించారు. రాజప్పకు మహిళలు పూలదండలు వేసి హారతులు ఇచ్చి సాదర స్వాగతం పలికారు. నాయకులు గుమ్మళ్ళ రామకృష్ణ, గోలి శ్రీరామ్‌చౌదరి, కొండపల్లి కృష్ణమూర్తి, చిల్లే వెంకటలక్ష్మీమోహనరావు, సంగమేశ్వరరావు, చీకట్ల వెంకటేష్, పాలకుర్తి శ్రీనుబాబు, పాలకుర్తి వీరభవన్నాయణ (రవిబాబు), మునిరెడ్డి శ్రీరాములు, రాంబాబు, పెంకే వెంకటేష్, కుర్రా నారాయణస్వామి (రాజు), నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు రూరల్ (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ ఎన్ వర్మ దుర్గాడలో పర్యటించారు. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరిస్తూ ప్రజలకు కరపత్రాలు అందజేశారు. గొల్లప్రోలు మాజీ జడ్పీటీసీ మడికి సన్యాసిరావు, నాయకులు తూము బాబు, పెనుగొండ లక్ష్మీపతి, మల్లిపూడి వీరబాబు, గుండ్ర సుబ్బారావు, బేతా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేదరికం లేని సమాజ సాధనే పీ4 లక్ష్యం

పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి



చక్రమ్మ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీరమణి

పెద్దాపురం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పేదరికం లేని సమాజ సాధనే పీ4 లక్ష్యమని పెద్దాపురం ఆర్డీవో కట్రెడ్డి శ్రీరమణి పేర్కొన్నారు. పీ4లో భాగంగా తాను దత్తత తీసుకున్న కాండ్రకోట గ్రామానికి చెందిన మామిడి చక్రమ్మ కుటుంబాన్ని బుధవారం ఆమె సందర్శించారు. కుటుంబ ప్రస్తుత ఆర్థిక పరిస్థితి, ఇంటింటికీ కుళాయి, విద్యుత్ కనెక్షన్, దీపం-2, రేషన్ సరుకులు, పింఛను, తల్లికి వందనం, విద్యార్థి మిత్ర కిట్లు, ఇతర సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. గృహం, కుటుంబీకుల ఆరోగ్య పరిస్థితి, పిల్లల చదువులు, ఉపాధి అవకాశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ తాను మూడు బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్నానని చెప్పారు.

'ఎస్సీ, బీసీ సామాజికవర్గాల మధ్య చిచ్చుపెడితే సహించం'

కాకినాడ సిటీ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అమలాపురంలో ఆర్థిక లావాదేవీల కారణంగా జరిగిన దాడిని కొంతమంది వ్యక్తులు సాకుగా చూపి ఎస్సీ, బీసీ సామాజిక వర్గాల మధ్య చిచ్చుపెట్టడాన్ని సహించబోమని బీసీ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ పప్పు దుర్గారమేష్ హెచ్చరించారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పది రోజుల క్రితం కోనసీమ జిల్లాలో ఇదరు వ్యక్తుల మధ్య జరిగిన వ్యక్తిగత ఆర్థిక వివాదాన్ని మంత్రి సుభాష్‌కు, ఆయన విద్యా సంస్థకు ముడిపెట్టి దుష్ప్రచారానికి పాల్పడ్డాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో ధన్వంతరి నాయీబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుందరపల్లి గోపాలకృష్ణ, విశ్వబ్రాహ్మణ సంఘం కాకినాడ జిల్లా అధ్యక్షుడు చెల్లూరి సత్యనారాయణ, కర్ణభక్త సంక్షేమ సంఘం రాష్ట్ర కోశాధికారి గుడిమెట్ల వీర్రాజు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చొల్లంగి వేణుగోపాల్, బహుజన ఐక్య వేదిక రాష్ట్ర నాయకులు అయినవిల్లి నారాయణగౌడ్, గుత్తుల శ్రీనివాస్, పలివెల లక్ష్మి, తుట్టా లీలావతి, పంపన బుజ్జి, కొమ్మన తాతారావు, జగ్గారపు గణేష్ పాల్గొన్నారు.

వాకలపూడిలో సెంట్రల్ కిచెన్ తనిఖీ



వాకలపూడిలో ఆహార నాణ్యతను రుచి చూస్తున్న కాకినాడ కమిషనరు భావన

సర్పవరం జంక్షన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ వాకలపూడిలో హరేకృష్ణ మిషన్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అక్షయపాత్ర సెంట్రల్ కిచెన్‌ని కాకినాడ కమిషనరు భావన బుధవారం పరిశీలించారు. ఆహార తయారీ యంత్రాలు, కిచెన్, స్టోరేజ్ రూమ్‌లను పరిశీలించారు. ఆహారాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అన్న క్యాంటీన్లలో మెనూను విధిగా అమలు చేయాలని సూచించారు. ఆర్డీవో వెంట పెద్దాపురం కమిషనరు శ్రీకాంత్, కాకినాడ కార్పొరేషన్ అదనపు కమిషనరు కేటీ సుధాకర్, ఎస్ఈ పి.వెంకట్రావు, ఎంహెచ్‌వో డాక్టర్ పృధ్వీచరణ్ వున్నారు.

కార్పొరేషన్: నగరంలోని సంతచెరువు వద్ద గల అన్న క్యాంటీన్‌ను కమిషనర్ భావన సందర్శించారు. అక్కడ తాగునీరు, పారిశుధ్యం, డ్రైనేజీ సమస్యలను గుర్తించారు. వాటిని సత్వరం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో అదనపు కమిషరు కేటీ సుధాకర్, ఎస్ఈ పి.వెంకట్రావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృధ్వీచరణ్ పాల్గొన్నారు.

'పాఠశాలల అభివృద్ధిలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర'

గొల్లప్రోలు రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల అభివృద్ధి, విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని సమగ్ర శిక్షా సీఎంవో చామంతి నాగేశ్వరరావు సూచించారు. చేబ్రోలులోని ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాలలో కాకినాడ జిల్లాలోని ఉపాధ్యాయులకు ఇస్తున్న రెండో విడత శిక్షణ బుధవారం మూడో రోజుకు చేరుకుంది. సీఎంవోతో పాటు ఏఎంవో జగన్మోహనరావు, ఏఎస్‌వో జోగిరెడ్డి పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. రిసోర్స్‌పర్సన్లు పాల్గొన్నారు.

'సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుతాం'

గొల్లప్రోలు రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం కొడవలి, కొత్తపల్లి మండలం శొంఠివారిపాకలలను నాటుసారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుతామని ఎక్సైజ్ సీఐ వెంకటలక్ష్మి తెలిపారు. కొడవలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం నవోదయం 2.0 కార్యక్రమం నిర్వహించారు. ఈ ఏడాది తమ స్టేషన్ పరిధిలో 138 కేసుల్లో 93 మందిని అరెస్టు చేసి 740 లీటర్ల నాటుసారా, రెండు మోటారు సైకిళ్లు, 150 కిలోల నల్లబెల్లాన్ని స్వాధీనం చేసుకుని 41,220 లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేసినట్టు సీఐ చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ వెంకటలక్ష్మి

'స్వమిత్వ రీ సర్వేను పారదర్శకంగా నిర్వహించాలి'

కొత్తపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో వచ్చే నెల ఒకటో తేదీ నుంచి జరిగే స్వమిత్వ రీ సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో హరి సత్యారెడ్డి విజ్ఞప్తి చేశారు. కొత్తపల్లి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీల కార్యదర్శులు, వీఆర్వోలు, సర్వే సిబ్బందికి బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సత్యారెడ్డి మాట్లాడుతూ మండలంలోని 14 గ్రామాల్లో ఆగస్టు 1 నుంచి అక్టోబరు 31 వరకు ఇళ్లను రీ సర్వే చేయాలన్నారు. ఇళ్లు, పరిసరాలను కొలతలు తీసే సమయంలో ప్రజలు తెలియజేసిన అభ్యంతరాలను పరిష్కరించాలని సూచించారు. గ్రామాల్లో సభలు ఏర్పాటుచేసి రీ సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సిబ్బందికి పెదిరెడ్ల వీరగణేష్, మధుబాబు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రీసర్వే విధానంపై అవగాహన కల్పించారు. సూపరింటెండెంట్ ఎ.చలమయ్య పాల్గొన్నారు.

'దందాలు చేసే వారి నుంచి రక్షణ కల్పించండి'

పిఠాపురం రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): తాము కొనుగోలు చేసి భూమిని సాగు చేసుకోవాలంటే రూ.30లక్షలు ఇవ్వాలని కొందరు తమను వేధిస్తున్నారని, దందాలు చేసే వారి నుంచి తమకు రక్షణ కల్పించాలని పిఠాపురం మండలం కందరాడకు చెందిన దేశినీడి వీరవెంకటేశ్వరరావు, జయసత్యరమేష్ కోరారు. తాము 2024-25 కాలంలో ఎఫ్‌కే పాలెంలో 2.02 ఎకరాలు కొనుగోలు చేశామని, పొలంలో రెండు పంటలూ పండించుకున్నామని చెప్పారు. ఇటీవల కొంతమంది తమ పొలం వద్దకు వచ్చి కులం ముసుగులో తాము అడిగినంత డబ్బులు ఇవ్వాలని, లేకుంటే సాగు చేసుకోనివ్వమని బెదిరిస్తున్నారని వాపోయారు. తమ పొలం వివాదంలో ఉందని బెదిరిస్తూ సెటిల్మెంట్ చేసుకోవాలని ఒత్తిడి తెస్తున్నారని, ఇదే విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. దందాలు చేస్తున్న వారి నుంచి తమకు రక్షణ కల్పించి పొలం సాగు చేసుకునేలా చర్యలు చేపట్టాలని పోలీసులను కోరారు.

రేపు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

సామర్లకోట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయ ఆవరణలోని బాలాత్రిపురసుందరి అమ్మవారి మందిరం ఎదుట శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సామూహిక వరలక్ష్మీ వ్రతాలు జరుగుతాయని ఈవో బళ్ల నీలకంఠం తెలిపారు. పాల్గొనదలచిన మహిళలు దేవస్థానం కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

3న అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 30 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 9 నుంచి 11వ తేదీ వరకు బాపట్లలో సౌత్‌జోన్ స్టేట్ మీట్ జరగనుంది. ఇందులో పాల్గొనేందుకు వచ్చే నెల 3వ తేదీ ఉదయం 8 గంటలకు కాకినాడ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్దాపురం ఎంఆర్ కాలేజీలో అండర్-14, 16, 18, 20 విభాగాల్లో క్రీడాకారుల ఎంపిక జరుగుతుందని ప్రెసిడెంట్ టీవీఎస్ రంగారావు, సెక్రటరీ కె.సుబ్రహ్మణ్యం, ట్రెజరర్ ఎస్‌వీవీఎల్‌జీ వర్మ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్ కార్డు, బర్త్ సర్టిఫికెట్‌తో హాజరు కావాలని వారు కోరారు.

'రుణాలను సకాలంలో తిరిగి చెల్లించాలి'

గొల్లప్రోలు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): బ్యాంకుల నుంచి తీసుకుని రుణాలను సకాలంలో చెల్లిస్తే వ్యాపారాభివృద్ధికి మరిన్ని రుణాలు అందించే వీలుంటుందని ఎస్‌బీఐ మేనేజరు పి.జయంత్ పేర్కొన్నారు. బుధవారం గొల్లప్రోలులో నగర పంచాయతీ కమిషనరు నామ కనకారావు అధ్యక్షతన టౌన్ వెండింగ్ కమిటీ సమావేశం జరిగింది. నగర పంచాయతీ మేనేజరు నవీన్, టీపీవో నీలిమా దీప్తి మాట్లాడుతూ వీధి వ్యాపారస్తుల వ్యాపారాల నిర్వహణకు వెండింగ్ జోన్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. ఐడీ కార్డులు, వెండింగ్ సర్టిఫికెట్ల నిమిత్తం ఒక్కొక్కరు రూ.100 వంతున చెల్లించాలని సూచించారు. మెప్మా సీఎంఎం భారతి, వీరబాబు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

'రైతులకు సక్రమంగా సాగునీరు అందించాలి'

తాళ్లరేవు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మొదటి పంట ముందుకు సాగేందుకు సాగునీటిని రైతులకు సక్రమంగా అందించాలని నీలపల్లి నీటి సంఘం అధ్యక్షుడు దూళిపూడి గోవిందరావు కోరారు. బుధవారం తాళ్లరేవు ఇరిగేషన్ కార్యాలయం వద్ద ఏఈ అనూష అధ్యక్షతన నీటి సంఘం సభ్యుల సమావేశం జరిగింది. సాగునీటి కొరతపై చర్చించారు. నీటిమట్టం లెవెల్ పెరగకపోతే సాగునీటి సమస్యలు తప్పవన్నారు. మాజీ చైర్మన్ వుంగరాల వెంకటేశ్వరరావు, నీటి సంఘం డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఎంఎస్ఎన్ చారిటీస్ కరస్పాండెంట్, ఈవోగా

నీలకంఠానికి అదనపు బాధ్యతలు

సామర్లకోట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జగన్నాథపురంలోని ఎంఎస్ఎన్ చారిటీస్ కరస్పాండెంట్, ఈవోగా సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయ ఈవో బళ్ల నీలకంఠానికి అదనపు బాధ్యతలు అప్పగించారు. తక్షణం ఆయన బాధ్యతలు స్వీకరించాలని దేవదాయ శాఖ ఆర్జేసీ కార్యాలయం బుధవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

'మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి'

రౌతులపూడి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రత్తిపాడు సీఐ సూరి అప్పారావు సూచించారు. బుధవారం ఎ. మల్లవరంలో సాంఘిక సంక్షేమ అంబేడ్కర్ గురుకులం కళాశాల నందు ఎస్ఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సామాజిక మాధ్యమాలు, పలు విషయాలపై వివరించారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న పీవో అపూర్వ భరత్

ఎటపాక గ్రీవెన్స్‌లో 57 అర్జీలు

ఎటపాక, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఎటపాక మండల పరిషత్ సమావేశం హాల్లో బుధవారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమానికి 57 అర్జీలు వచ్చాయి. ఈ అర్జీల్లో ఆర్అండ్ఆర్‌కు సంబంధించి 5 అర్జీలు, భూ వివాదాలపై 28, ఇతర వాటిపై 24 అర్జీలను పీవో అపూర్వ భరత్ స్వీకరించారు. ఈ అర్జీలను వెంటనే నిర్ణీత సమయంలో పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు ఆయన ఆదేశించారు. ఎటపాక మండలం కన్నాయిగూడెం, ఎటపాక, చింతలగూడెం గ్రామాల్లో ఇసుక, మట్టి అక్రమ వ్యాపారం యథేచ్ఛగా సాగుతున్నాయని, తహసీల్దార్ సుబ్బారావు దృష్టికి దీన్ని తీసుకెళ్లినా చర్యలు తీసుకోవడం లేదని కన్నాయిగూడెం గ్రామ పెసా కమిటీ కార్యదర్శులు నరేష్, అర్జున్ పీవోకు ఫిర్యాదు చేశారు. ఎటపాక మండలంలోని నందిగామ, మురుమూరు గ్రామాల్లో గతంలో పోలవరం పరిహారం పొందిన ముంపు భూములను స్థానిక ఆదివాసీలకు పంటల సాగుకు తాత్కాలిక అనుమతులు ఇవ్వాలని ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో పీవోకు వినతిపత్రం అందజేశారు. భద్రాచలం-కూనవరం రోడ్డులో గన్నవరం గ్రామం నుంచి నందిగామ వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ముళ్లపొదలను తొలగించాలని కోరుతూ కృష్ణవరం ఎంపీటీసీ కంటే రాజు పీవోకు విన్నవించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రేమ్‌సాగర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'కొత్త వారికి ఆశ్రయం ఇవ్వకండి'



డొంకరాయి పోలీస్ స్టేషన్ వద్ద వాహనాన్ని తనిఖీలు చేస్తున్న పోలీస్ సిబ్బంది

మోతుగూడెం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): వైరామవరం మండలం బొడ్డగండి పంచాయతీ డొంకరాయి పోలీస్ చెక్ పోస్ట్ వద్ద బుధవారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. స్థానిక ఎస్ఐ శివకుమార్ ఆధ్వర్యంలో పోలీసు బలగాలు వాహనాలను ఆపి నిశితంగా పరిశీలించి వివరాలు తీసుకుని విడిచిపెట్టారు. ఆయా వాహనాల్లో ఉన్న సామగ్రిని పరిశీలించారు. కొత్త వారికి ఆశ్రమం కల్పించవద్దని ఎస్ఐ సూచించారు. గ్రామాల్లో అనుమానితులుంటే తమకు సమాచారం చెప్పాలన్నారు. కార్యక్రమంలో డొంకరాయి సివిల్ పోలీసులతో పాటు సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించరూ..

రంపచోడవరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ కూలీలకు పెండింగ్ బకాయిలను వెంటనే బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని అఖిల భారత రైతుకూలీ సంఘం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పల్లాల లచ్చిరెడ్డి, కుంజా దూలయ్య డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మార్క్స్ ఏంగెల్స్ భవనంలో ఏఐకేఎంఎస్ ఉపాధ్యక్షుడు ఐ.వి.రమణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ ఉపాధి పనుల్లో రోజు వేతనం రూ.500 పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి కూలీలకు పరికరాలు అందజేయాలని కోరారు. సమావేశంలో ఏఐకేఎంఎస్, పీవైఎల్, పీవోడబ్ల్యు డివిజన్ కార్యవర్గ సభ్యులు పల్లాల రాజారెడ్డి, కంగల బాలుదొర, మడి ప్రసాద్‌దొర, అన్నిక పండమ్మ, ఆదిలక్ష్మి, కాంతమ్మ, చిలకమ్మ, ధర్మారెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, పాపన్నదొర, లింగారెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి చర్యలు



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సింహాచలం

రంపచోడవరం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): వెదురు ఉత్పత్తుల ద్వారా గిరిజన మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేలా చర్యలు చేపట్టామని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. బుధవారం ఐటీడీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫారెస్ట్ ప్రొడ్యూసర్ కంపెనీ అవగాహన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీవో(జీ) డీఎస్వీ రమణ, ఏపీడీ డేగలయ్య, డీపీఎం పరమేశ్వరరావు, ఐఎస్‌బీ కోఆర్డినేటర్లు సందీప్ చౌదరి, నానిబాబు, హేమంత్‌కుమార్, ఏపీఎంలు అపర్ణ, దుర్గప్రసాద్, ఆదినారాయణ, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఇందుకూరుపేటలో బంగారు వరలక్ష్మి కానుక-3



డ్రా గెలుపొందిన వారికి వరలక్ష్మి కానుక ఇస్తున్న శ్రీనివాస్

దేవీపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఇందుకూరుపేట గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో బుధవారం నిర్వహించిన బంగారు వరలక్ష్మి కానుక-3 కార్యక్రమానికి స్పందన లభించింది. తొలుత విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు, పద్మావతి దేవి గంగారత్నం దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి లక్కీ డ్రా కార్యక్రమాన్ని ప్రారంభించారు. గెలుపొందిన 80 మంది మహిళలకు శ్రీనివాసరావు దంపతులు బంగారు వరలక్ష్మి రూపులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడారు. అనంతరం లక్కీ డ్రాలో గెలుపొందని మహిళలకు పసుపు, కుంకుమ, జాకెట్టు ముక్క పంపిణీ చేశారు. కార్యక్రమంలో బత్తుల నానాజీ, రావిపాటి గోవింద్ రావు, కంబాల యువసేన అధ్యక్షులు ఉంగరాల మణిరత్నం, దేశాల నరేష్, నాగ రమేష్, వీరంజలి, మళ్ల ఆదిశేషు, కాకర దుర్గారావు, పోతుల బుల్లబ్బాయి, నందూరి దుర్గారావు, కోటేశ్వరరావు, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న టేబుల్ టెన్నిస్ పోటీలు

ఎటపాక, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఎటపాక జవహర్ నవోదయ విద్యాలయంలో నిర్వహిస్తున్న రీజనల్ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు బుధవారం రెండో రోజు కొనసాగాయి. రెండో రోజు అదే ఉత్సాహంతో విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. నాలుగు రాష్ట్రాలతోపాటు అండమాన్ నికోబార్, లక్షద్వీప్ ప్రాంతాల్లోని ఎనిమిది క్లస్టర్ల నుంచి మొత్తం 96 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో 48 విద్యార్థినులు, 48 విద్యార్థులు టేబుల్ టెన్నిస్ పోటీలకు హాజరయ్యారు. రెండో రోజుతో పోటీలు 70 శాతం పూర్తయ్యాయని, మూడు రోజుల పోటీలు ముగిశాక, ఆగస్టులో అస్సాంలో జరిగే నేషనల్ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎటపాక జవహర్ నవోదయ విద్యాలయంలో ఎంపిక జరుగుతుందని ప్రిన్సిపాల్ ప్రసాద్ తెలిపారు. నేషనల్‌స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు 15 రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా లక్ష్మయ్యరాజు



చింతూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల అధ్యక్షుడిగా బట్ట లక్ష్మయ్య రాజు నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు మఠం శాంత కుమారి బుధవారం నియామక పత్రం విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ సమష్టిగా పనిచేసి పార్టీని బలోపేతం చేస్తామన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

పాఠశాలను పట్టించుకోరా?

» చినశంకర్లపూడిలో అధ్వానంగా స్కూల్
» వర్షం కురిస్తే తరగతి గదుల్లోకి నీరు
» 5 గదుల్లో హైస్కూల్ తరగతులు
» వరండాల్లో ప్రాథమిక తరగతులు



తరగతి గదుల్లో బురదనీరు



చినశంకర్లపూడిలో ప్రాథమిక, హైస్కూల్ కొనసాగుతున్న విద్యాసంస్థల ప్రాంగణం

ప్రత్తిపాడు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మండలం చినశంకర్లపూడిలోని ప్రాథమిక, హైస్కూల్ తరగతులు కొనసాగే పాఠశాల పరిస్థితి అధ్వానంగా ఉంది. గ్రామంలో పంచాయతీ కార్యాలయం వెనుక ఈ పాఠశాల ఉంది. 1 నుంచి 5 వరకు ప్రాథమిక పాఠశాల, 6 నుంచి 10వ తరగతి వరకు హైస్కూల్ ఒకే కాంపౌండ్‌లో కొనసాగుతున్నాయి. హైస్కూల్లో 110 మంది వరకు విద్యాభ్యాసం చేస్తుండగా, ప్రాథమిక పాఠశాలలో 68 మంది వరకు చదువుతున్నారు. ప్రాథమిక, హైస్కూల్ తరగతుల నిర్వహణకు 10 గదులు అవసరం ఉండగా కేవలం 6గదులే అందుబాటులో ఉన్నాయి. వీటిలో ఒక రూము ప్రధానోపాధ్యాయుల కార్యాలయంగా ఉపయోగిస్తున్నారు. మిగిలిన 5 గదుల్లో హై స్కూల్ తరగతులతో పాటు, ప్రాథమిక తరగతులు కూడా కలిసికట్టుగా నిర్వహిస్తున్నారు. గదుల్లో హైస్కూల్ విద్యార్థులు, వరండాలో ప్రాథమిక విద్యను అభ్యసిస్తున్నారు. ఈ పాఠశాల భవనం ఒకటి శిథిలావస్తకు చేరి కూలడానికి సిద్ధంగా ఉంది. మిగిలిన 3 బ్లాకులు కూడా మరమ్మతుల బారిన పడ్డాయి. అయితే 2వ ఫేజ్ నాడు-నేడు నిధులతో పాఠశాల భవనాలకు మరమ్మతులు జరిపి గదుల్లో టైల్స్ ఫ్లోరింగ్ చేశారు. నాడు-నేడు నిధులతో బెంచీలు, బోర్డులు వంటి సౌకర్యాలు కల్పించారు. అయితే ఏ మాత్రం వర్షం కురిసినా ఈ పాఠశాల ముంపు బారినపడడంతో వర్షాకాలంలో అపరిశుభ్రత వాతావరణం, మురికినీటి దుర్వాసన వస్తుం డడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎలిమెంటరీ విభాగానికి ఐదుగురు ఉపాధ్యాయులు పనిచేయాల్సి ఉండగా ఇరువురు ఉపాధ్యాయులే ఉన్నారు. వర్షాలు సీజన్‌లో అపారిశుధ్యం వల్ల అంటువ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఈ పాఠశాలను ఉన్నతాధికారులు పట్టించుకోవాలని కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన ఎలిమెంటరీ పాఠశాల భవనం

ప్రజా అర్జీలను పరిష్కరించాలి

తుని ఎమ్మెల్యే యనమల దివ్య



సమావేశంలో మాట్లాడుతున్న యనమల దివ్య

తునిరూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో వచ్చిన అర్జీలను గడువులోపు పరిష్కరించి ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలని తుని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. టీడీపీ క్యాంపు కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో ఆమె సమావేశమయ్యారు. మండలంలో పలు సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలు తీరుని ఎమ్మెల్యే అడిగి తెలుసుకుని సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో తహశీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో సాయి నవీన్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో 'శ్రీ ప్రకాష్' ప్రతిభ



వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

తునిరూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): నల్ల మల్లారెడ్డి ఫౌండేషన్ స్కూల్ హైదరాబాద్‌లో ఈనెల 26 నుంచి 29 వరకు నిర్వహించిన సీబీఎస్ఈ క్లస్టర్-7 వాలీబాల్ అండర్-14 బాలుర విభాగంలో శ్రీ ప్రకాష్ విద్యార్థులు ద్వితీయస్థానంలో నిలిచి వెండి పతకాలు సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను వారిని తీర్చిదిద్దిన కోచ్‌లు విజయ్, దుర్గా ప్రసాద్‌ను విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వికె.నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపాల్ ఎమ్‌వివిఎస్.మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ అపర్ణ, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

కాండ్రేగులలో న్యాయ సదస్సు

జగ్గంపేట రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాండ్రేగుల హైస్కూల్లో న్యాయ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా జడ్జి జి.చంద్రమౌళిశ్వరి పాల్గొన్నారు. ఇటీవల హైస్కూల్ నందు ఆరుగురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ నేపథ్యంలో సదస్సు నిర్వహించి విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడారు. సైకాలజీ నిపుణులతో పిల్లలకు అవగాహన కల్పించాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. పాఠశాలను పరిశీలించి ఉపాధ్యాయుల నుంచి పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి స్వామి, ఎస్ఐ రఘునాథరావు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు ఉన్నారు.

'విద్యార్థుల రక్షణకు ప్రత్యేక చర్యలు'

శంఖవరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థుల రక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు జిల్లా సమగ్రశిక్షా సీఎంవో చామంతి నాగేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక కేజీబీవి పాఠశాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. సీసీ కెమెరాల ఏర్పాటు పర్యవేక్షించి లాబ్‌ల నిర్వహణ వంటి అంశాలపై విద్యార్థుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏఎస్‌వో జ్యోతిరెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ బి.బాలమణి కుమారి తదితరులు ఉన్నారు.

'మహాసభలు జయప్రదం చేయాలి'

ప్రత్తిపాడు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ అఖిల భారత 18వ మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ ప్రత్తిపాడులో బుధవారం సీఐటీయూ నాయకులు కరపత్రాలు ఆవిష్కరించారు. మండల సీఐటీయూ ఆధ్వర్యంలో కార్యదర్శి ఈశ్వరరావు, కమిటీ సభ్యులు కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ డిసెంబరు 31, 2025 నుంచి జనవరి 4, 2026 వరకు విశాఖపట్నంలో సీఐటీయూ అఖిల భారత 18వ మహాసభలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సభలను విజయవంతం చేసేందుకు కార్మిక సంఘాలు తోడ్పాటునందించాలని కోరారు. కార్యక్రమంలో నిట్ల శ్రీను, అల్లాడి లక్ష్మి, సీహెచ్ వరలక్ష్మి, లోవ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జగ్గంపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కాట్రేవులపల్లి ఫీడర్ నందు మరమ్మతుల కారణంగా ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వీరభద్రరావు తెలిపారు. సీతానగరం, కాట్రేవులపల్లి గ్రామాలకు, బోరులకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

గండేపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలో బొర్రంపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న మల్లేపల్లికి, ఉప్పలపాడు సబ్‌స్టేషన్ పరిధిలో ఉప్పలపాడు, సుబ్బయ్యం పేట గ్రామాలకు బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు సహకరించాలని ఎలక్ట్రికల్ ఈఈ డి.వీరభద్రరావు, గండేపల్లి ఏఈ కిరణ్ కిషోర్ కోరారు.

'సీమాంధ్ర' యువజన కార్యదర్శిగా శ్రీను

రౌతులపూడి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం జిల్లా యువజన కార్యదర్శిగా రౌతులపూడికి చెందిన సుర్ల శ్రీను నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ సంక్షేమ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

ఆర్థికాభివృద్ధిలో ఆక్వా ఆదాయం కీలకం

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల



పవర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న యనమల

తొండంగి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): దేశ, రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో ఆక్వా ఆదాయం కీలకమని, ఇది మరింతగా అభివృద్ధి చెందితే ఆర్థిక వృద్ధి గణనీయంగా పెరుగుతుందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు అన్నారు. బుధవారం వేమవరంలో జీకేగ్రూపు సోలార్ పవర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ మండలంలో 200 వరకూ హెచరీలు విస్తరించి ఉన్నాయన్నారు. ఆక్వాకు జాతీయ అంతర్జాతీయ మార్కెట్ ఉందన్నారు. ఈ ప్రాంత రైతులు కూడా సోలార్ పవర్ వినియోగంపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. కోన ప్రాంతంలో సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జీకే కృష్ణారెడ్డి, సిద్ధార్థ రెడ్డి, రాజా అశోక్ బాబు, చింతంనీడి నాగ సోమరాజు, మోతుకూరి వెంకటేష్, కొయ్యా శ్రీనుబాబు, ఇనుగంటి సత్యన్నారాయణ, సప్తగిరి హేచరీ పెదబాబు, దొర ఉన్నారు.

టీడీపీ కార్యాలయం ప్రారంభం

వేమవరంలో టీడీపీ కార్యాలయాన్ని యనమల రామకృష్ణుడు ప్రారంభించారు. ఎమ్మెల్యే యనమల దివ్య తుని అభివృద్ధికి నిధులు తీసుకువస్తున్నారని వాటిని వినియోగించి అభివృద్ధి సాధించాలన్నారు. నేమాల బాబూరావు, రాధాకృష్ణ, విజయ్ కుమార్, చింతంనీడి అబ్బాయి, మోతుకూరి వెంకటేష్, కొయ్యా శ్రీ నుబాబు, బంటుపల్లి అన్వేష్, దూలం మురళి, కొయ్యా సూరిబాబు, అరిగెల నర్సింహమూర్తి ఉన్నారు.

జగ్గంపేట అభివృద్ధి కమిటీని ప్రకటించిన ఎమ్మెల్యే



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న నెహ్రూ

జగ్గంపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక రావులమ్మ నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధి కమిటీని ప్రకటించారు. చైర్మన్‌గా టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్, సభ్యులుగా ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కుంచే రాజా, కందుల చిట్టిబాబు, కోర్పుసాయి తేజ, జంపన సీతారామచంద్ర వర్మ, చదరం గోవిందరాజులు (చంటిబాబు) కంచుమర్తి రాఘవ, హలోనిన్ ప్రశాంత్ కుమార్, జనపరెడ్డి సుబ్బారావు, బత్తుల సత్తిబాబు నియమించినట్టు ఎమ్మెల్యే తెలియజేశారు.

సచివాలయం ప్రారంభం

స్థానిక పద్మనాభ నగర్‌లో రూ.48.6లక్షలతో నిర్మాణం చేసిన సచివాలయం3ని బుధవారం జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. పలు గదులను ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, జీను మణిబాబు, దేవరపల్లి మూర్తి, సత్తి సదాశివరెడ్డి, పాలచర్ల నాగేంద్ర చౌదరి, వేముల కొండ జోగారావు ప్రారంభించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గండేపల్లి మండలం మల్లేపల్లికి చెందిన శ్రీరామ కిసాన్ డ్రోన్ సీహెచ్‌సీ రైతు గ్రూపునకు డ్రోన్‌ను ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అందించారు. గోకవరం రోడ్డులోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పెద్దాపురం లలిత ఎంటర్ ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆర్థిక సహాయంతో నిర్మించిన ఆర్వో ప్లాంట్ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. లలిత ఎంటర్‌ప్రైజస్ అధినేతలు మట్టే సత్య ప్రసాద్, మట్టె శ్రీనివాస్, లలిత ఎంటర్ ప్రైజస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మట్టె ఆదిశంకర్ తదితరులు హాజరయ్యారు.

అదృశ్యమైన వివాహిత ఆచూకీ గుర్తింపు

గండేపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో సింగరంపాలెం గ్రామానికి చెందిన వివాహిత ఈనెల 18న కనిపించకుండా వెళ్లిపోయింది. దీనిపై గండేపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ మేరకు గండేపల్లి ఎస్ఐ శివ నాగబాబు ప్రత్యేక టీంతో దర్యాప్తు చేసి ఆమె తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లో ఉన్నట్టు గుర్తించి పట్టుకున్నట్టు జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ పేర్కొన్నారు.

'ఆదిత్య'లో ముగిసిన ఆన్‌లైన్ సర్టిఫికేషన్ కోర్స్

గండేపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఆదిత్య లెర్నింగ్ అకాడమీ, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం సంయుక్తంగా నిర్వహించిన ఫండమెంటల్స్ ఆఫ్ క్వాంటమ్ కంప్యూటింగ్ ఆన్‌లైన్ సర్టిఫికేషన్ కోర్స్ విజయవంతంగా ముగిసింది. రిసోర్స్ పర్సన్‌గా డాక్టర్ ఆర్‌విఎస్.లలిత వ్యవహరించారు. పరిశ్రమ నిపుణుల క్వాంటమ్ కంప్యూటింగ్‌లోని ముఖ్యమైన అంశాలు విద్యార్థులకు చెప్పారు.

ముద్రగడ కోసం పూజలు

శంఖవరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఆరోగ్యం మెరుగుపడాలని బుధవారం నెల్లిపూడిలో వైసీపీ నేత వెలుగుల రవి ఆధ్వర్యంలో కార్యకర్తలు పూజలు నిర్వహించారు. గ్రామదేవత బోడ కొండమ్మ, వినాయకుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. వైసీపీ మండల కన్వీనర్ నరాల శ్రీను, ఎంపీటీసీ పిర్ల నాగేశ్వరరావు, వెలుగుల ప్రసాద్, వెలుగుల నాగేశ్వరరావు, చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

తుమ్మలపల్లి పరామర్శ

జగ్గంపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మల్లిశాలకు చెందిన టీడీపీ సీనియర్ నేత పైడిపాల సత్యనారాయణ సతీమణి మంగళవారం మృతిచెందారు. జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ సత్యనారాయణను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సత్యదేవుడి సన్నిధిలో పూర్వపు దేవదాయ కమిషనర్ పూజలు



స్వామివారి ప్రసాదం అందజేస్తున్న ఈవో

అన్నవరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో బుధవారం పూర్వపు దేవదాయ కమిషనర్ అనూరాధ కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్ ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేయగా ఈవో స్వామివారి ప్రసాదం అందజేశారు.

అన్నవరం స్మార్త పాఠశాల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఈవో, చైర్మన్

అన్నవరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్మార్త ఆగమపాఠశాల విద్యార్థులు ఈనెల 26న కాకినాడలో జరిగిన స్మార్త విద్వత్ సభలలో ప్రతిభ కనబరిచారు. మొత్తం 23మంది ఆగమ పాఠశాల విద్యార్థులు పాల్గొనగా వారిని బుధవారం ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్ అభినందించి విజయపత్రాలు అందజేశారు. చైర్మన్ మాట్లాడుతూ దేవస్థానం స్మార్తపాఠశాల గుర్తింపు తెచ్చేవిదంగా ఆగమ పాఠశాల విద్యార్థులు వ్యవహరించాలన్నారు. పాఠశాల అధ్యాపకులు ఆరాధ్యుల నరసింహమూర్తి ఉన్నారు.

పంట పొలాన్ని పరిశీలించిన పోలీసులు

ప్రత్తిపాడు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మండలం ఇ.గోకవరం గ్రామంలో నరికివేతకు గురైన పంట పొలాన్ని బుధవారం పెద్దాపురం డీఎస్పీ కె.శ్రీహరిరాజు, సీఐ బి.సూర్య అప్పారావు, ఎస్ఐ ఎస్ లక్ష్మీకాంతం పరిశీలించారు. గ్రామంలో అరటి, కొబ్బరి తోటలను నరికివేశారని బాధిత రైతు సత్తి వినోద్‌కుమార్ రెడ్డి మంగళవారం రిలే నిరాహార దీక్షలు పంట పొలం వద్ద చేపట్టిన విషయం తెలిసిందే. డీఎస్పీ, సీఐ, ఎస్ఐలు గోకవరంలోని అరటి, కొబ్బరి నరికివేత ఘటన ప్రదేశాలను పరిశీలించారు. బాధ్యులు ఎవరనేది దర్యాప్తు చేపట్టారు.

'తాగునీరు ఏర్పాటు చేయాలి'

జగ్గంపేట రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజపూడి హైస్కూల్లో విద్యార్థులకు తాగునీరు లేకపోవడంతో పీడీఎస్‌యూ, ఎఐఎఫ్‌టీయూ రైతు కూలీ సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కడితి సతీష్ మాట్లాడుతూ స్కూల్ నందు అధికారులు తాగునీరు ఏర్పాటు చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఏపీఆర్‌సీఎస్ నాయకులు కర్నాకుల రామలింగేశ్వరరావు, డాన్ శ్రీను, జాన్ తదితరులున్నారు.